

# యూరియా కోసం ఆందోళన వద్దు!

- ఎంత కావాలన్నా ప్రభుత్వం సరఫరా చేస్తోంది!
- ఇప్పటికే 17 వేల మెట్రిక్ టన్నుల నిల్వ
- అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు
- వ్యాపారుల లైసెన్సులనూ రద్దు చేస్తాం
- 'ఆంధ్రజ్యోతి'తో జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి



'యూరియా కోసం రైతులు ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం. మన అవసరం మేరకు కేటాయింపులు జరపడమేగాక ఇంకా అవసరమైతే పక్క జిల్లాల నుంచి కూడా దిగుమతి చేసుకునే వెసులుబాటు మనకు ఉంది.' అని జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) పి.సత్యవాణి తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరతపై 'ఆంధ్రజ్యోతి'తో ఆమె ముచ్చటించారు. జిల్లా అవసరాల మేరకు ప్రభుత్వం ఎరువులను కేటాయిస్తోందని, అవసరమైతే పక్క జిల్లాలకు కేటాయించిన ఎరువులను కూడా జిల్లాకు అందించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రస్తుతం 17వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉండగా, మరో రెండు రోజుల్లో ఇంకా వస్తుంది. అయితే, రైతుల అవసరాన్ని ఆసరా చేసుకుని అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- వివరాలు 6లో

## ఏపీఐఐసీ జడ్‌ఎంగా శివకుమార్

నెల్లూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఏపీఐఐసీ జిల్లా జోనల్ మేనజర్ (జడ్‌ఎం)గా ఎల్ శివకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ఈయన తహసీల్దార్ నుంచి డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందగా, తాజాగా జిల్లా జడ్‌ఎంగా పోస్టింగ్ లభించింది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా 44 మంది డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. జిల్లాలోనూ పలు స్థానాల్లో బదిలీలు జరిగాయి. రామాయపట్నం భూసేకరణ విభాగంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్ విజయకుమార్‌ను ఐటీడీఏ పీవోగా నియమించారు. టీజీపీ రాపూరు యూనిట్ ఎస్‌డీసీగా పనిచేస్తున్న ఎం కిరణ్‌కుమార్‌ను కడప మెప్మా పీడీగా బదిలీ చేసి ఆ స్థానంలో టీ శ్రీనివాసరెడ్డిని నియమించారు.

## ఓబన్న ధైర్యసాహసాలు యువతకు స్ఫూర్తి

- డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు



మాట్లాడుతున్న డీఆర్‌వో

నెల్లూరు (హరనాథపురం) జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : తొలి తరం స్వాతంత్య్రం సమరయోధుడు ఓబన్న ధైర్యసాహసాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు అన్నారు. శనివారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఓబన్న జయంతిని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ తొలితరం స్వాతంత్ర్య సమరయో ధుడు ఓబన్న సేవలు వెలకట్ట లేనివని అన్నారు. వడ్డెర సంక్షేమ సంఘ నాయ కుల విజ్ఞప్తి మేరకు నగరంలో ఓబన్న పేరుతో సామాజిక భవనం, విగ్రహం ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తామని చెప్పారు. తొలుత వడ్డెర ఓబన్న చిత్రపటానికి అధికారులు, వడ్డెర సంఘం నాయకులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మి, వడ్డెర సంక్షేమ సంఘ నాయకులు బెల్లంకొండ శ్రీనివాసులు, ఉప్పు భాస్కర్‌రావు, వల్లెపు మునుస్వామి పాల్గొన్నారు.

# పండుగ సందడి



నెల్లూరు ప్రధాన బస్టాండులో రద్దీ

ఇవన్నీ భోగి మంటల కోసమే..

నెల్లూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎటు చూసినా జనం.. వస్త్రాలు కొనేవారు కొందరైతే.. బంగారం కొనేవారు ఇంకొందరు.. ఇంట్లో సామగ్రి కొనేవారు మరికొందరు.. ఇలా జిల్లాలోని నగరం, పట్టణాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. పెద్ద పండుగ (సంక్రాంతి) నేపథ్యంలో జిల్లా కేంద్రమైన నెల్లూరులో ఏ వీధి చూసినా జనాలతో కళకళలాడింది. సంక్రాంతికి కొత్త దుస్తులు ధరించాలన్నది హిందువుల సంప్రదాయం. ఈ నేపథ్యంలో నగరంలో వస్త్ర దుకాణాలన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. స్కూళ్లకు కూడా సెలవులు కావడంతో కుటుంబ సమేతంగా షాపింగ్ చేస్తున్నారు. గడిచిన మూడు నాలుగు రోజుల్లోనే రూ.కోట్ల వస్త్ర వ్యాపారం జరిగినట్లు అంచనా. ఇక బంగారు దుకాణాలు కూడా కొనుగోలుదారులతో కళకళలాడాయి. నగర వాసులే కాకుండా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు జిల్లా కేంద్రానికి వచ్చి అవసరమైన వస్తువులు కొనుగోలు చేశారు. ట్రంకు రోడ్డు, మినీ బైపాస్, స్టోన్‌హౌస్‌పేట, ఆత్మకూరు బస్టాండ్ వంటి ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. ఇక ఇతర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వచ్చేవారు.. జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారితో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కూడా సందడిగా మారాయి. జనాల రాకపోకలతో నెల్లూరు నగరంలో ట్రాఫిక్ కూడా విపరీతమైంది. ప్రధాన కూడళ్లు రద్దీగా మారిపోయాయి.

## కోడిపందేలు, జూదాలకు అనుమతుల్లేవ్

- నిర్వహిస్తే కఠిన చర్యలు
- ప్రత్యేక బృందాలతో నిఘా
- ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్ సేవలను వినియోగించుకోవాలి
- జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా జిల్లాలో కోడిపందేలు, ఇతర జూదాలు నిర్వహించరాదని, వాటికి ఎలాంటి అనుమతులు లేవని జిల్లా ఎస్పీ జీ. కృష్ణకాంత్ తెలిపారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎవరైనా పేకాట ఆడినా, ఇతర జూదాలు, కోడిపందేలు నిర్వహించినా, పాల్గొన్నా కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. గతంలో పేకాట, కోడి పందేల్లో అరెస్ట్ వారిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. ప్రత్యేక బృందాలతో జిల్లా వ్యాప్తంగా కోడిపందేలు, జూదాలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. మూగజీవాలను హింసిస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలా పాలపై 112కు సమాచారం అందించాలన్నారు. అధికారులు కూడా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

### చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

సంక్రాంతికి ప్రజలు సొంతూర్లకు వెళ్లడంతో చోరీలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. సొంతూర్లు, సుదూర ప్రాంతాలు, విహార, తీర్థయాత్రలకు వెళ్లేవారు ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్ యాప్ ద్వారా, 94407 96383, 93929 03413 నెంబర్ల ద్వారా స్థానిక పోలీసులను సంప్రదించి ఈ సేవలను ఉచితంగా పొందవచ్చన్నారు. జనసంచారం లేని, అనుమానాస్పద ప్రదేశాలపై ప్రత్యేక దృష్టి ఉంచి గస్తీ నిర్వహించాలని అధికారులను ఆయన ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీలు ఏ శ్రీనివాసరావు, డీ శ్రీనివాసరెడ్డి, జీ శ్రీనివాసరావు, రాజగోపాల్, చెంచురామారావు, చంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తర్వులన్నీ బేఖాతర్!

- మోపాడు చెరువులో చేపల పెంపకం
- ఏమీ పట్టనట్టు ఉన్న పంచాయతీ అధికారులు

- వివరాలు 6లో

# స్వయం ఉపాధికి చేయూత

- కార్పొరేషన్లకు నిధుల మంజూరు
- 50 శాతం రాయితీపై బీసీలకు రుణాలు
- 4,434 మందికి లబ్ధి చేకూరేలా ప్రణాళిక
- దరఖాస్తు దాఖలుకు 16 వరకే గడువు
- ఎస్సీలకూ వాహన రుణాలు

వైసీపీ హయాంలో నిర్వీర్యమైన కార్పొరేషన్లకు ఎన్డీఏ కూటమి పునరుజ్జీవం కల్పిస్తోంది. గతంలో కార్పొరేషన్లకు పాలక మండలి ఏర్పాటు చేసినా నిధులు విడుదలలో మాత్రం అప్పటి నాయకులు చేతులెత్తేశారు. పైసా విదల్చకుండా ఐదేళ్లు గడిపేశారు. పదవులు పొందిన నాయకుల్లోనూ తీవ్ర నిరాశ, నిస్పృహ నెలకొంది. అయితే, అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే కూటమి ప్రభుత్వం కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేసింది. వెనుకబడిన తరగతుల వారికి జీవనోపాధి కల్పించేందుకై సబ్సిడీ రుణాలు ఇవ్వనుంది. ఔత్సాహికులంతా దరఖాస్తు చేసుకోవాలంటూ ఇప్పటికే అధికారులు పిలుపునిచ్చారు.

నెల్లూరు (హరనాధపురం), జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన కులాలు, అగ్ర వర్ణాలలోని పేదలకు కూటమి ప్రభుత్వం సంక్రాంతికి తీపి కబురు అందించింది. ఎన్నికల హామీలలో భాగంగా 50 శాతం రాయితీతో స్వయం ఉపాధి యూనిట్లను మంజూరు చేసింది. 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వంలో అమలైన స్వయం ఉపాధి రాయితీ రుణ పథకం మళ్లీ అమలుకు సిద్ధమైంది. అప్పట్లో 50 శాతం రాయితీతో గరిష్ఠంగా రూ.2లక్షల వరకు రుణ భరోసా ఇవ్వగా, ప్రస్తుతం ఆ మొత్తాన్ని రూ.5లక్షల పెంచి మూడు స్లాబ్‌లలో అందించాలని నిర్ణయించింది. స్వయం ఉపాధి యూనిట్లకు స్లాబుల వారీగా రాయితీ కల్పిస్తారు. ఈ రాయితీ రుణాల కోసం దర ఖాస్తు చేసుకోవాలని ఇప్పటికే ఔత్సాహికులకు అధికారులు పిలుపునిచ్చారు. ఇచ్చే రుణాలను కూడా రూ.2లక్షలు, రూ.3లక్షలు, రూ.5లక్షలుగా స్లాబుల విభజన చేశారు. జనరిక్ ఔషధ దుకాణాలకు యూనిట్ విలువ రూ.8లక్షలు కాగా రూ.4లక్షల రాయితీ ఇవ్వనున్నారు. జిల్లాలోని బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు వర్గాలు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. రానున్న నాలుగు నెలల్లో 4,434 మందికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చిన్నతరహా కుటీర పరిశ్రమలు, సేవలు, చేతివృత్తులు, వ్యవసాయం యూనిట్ల ఏర్పాటుకూ అవకాశం కల్పించింది. వీటితోపాటు బీఫార్మసీ చదివిన వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి జిల్లావ్యాప్తంగా 96 జనరిక్ మందుల దుకాణాలను ఏర్పాటు చేయించనున్నారు. అలాగే స్వయం ఉపాధి కల్పనలో మహిళలకు పెద్దపీట వేసింది. వివిధ అంశాల్లో అతివలకు శిక్షణ ఇచ్చి యూనిట్ల ఏర్పాటుకు చేయూత అందించనుంది. ఇందుకోసం జిల్లాకు రూ.70 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం కార్పొరేషన్ల వారీగా లబ్ధిదారులకు రాయితీ రూపంలో రూ.24.20 కోట్లు వెచ్చించనుంది. దీనికి బ్యాంకు రుణాలు వెనుకబడిన తరగతుల ఆర్థిక అభివృద్ధి సంస్థ, లబ్ధిదారుల వాటా కలిపితే రూ.48.55 కోట్లు అవుతాయి. మండలం, గ్రామం, మున్సిపాలిటీల వారీగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుంది. తరువాత మిగిలిన నిధులు వెచ్చించనున్నారు. వీటితోపాటు రూ.8లక్షల విలువతో జనరిక్ మందుల దుకాణాలకూ అవకాశం కల్పించనుంది. ఇందులో రూ.4లక్షల రాయితీ లభించనుంది. బీఫార్మసీ చేసిన నిరుద్యోగులకు జనరిక్ దుకాణాలు ఏర్పాటు చేసుకునే అవకాశం కలగనుంది. గత వైసీపీ ప్రభుత్వం రూపాయి కూడా కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇవ్వలేదు. పైగా గత టీడీపీ ప్రభుత్వం హయాంలో మంజూరు చేసిన రుణాలను, లబ్ధిదారుల మెడకు కత్తిపెట్టి వసూలు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రుణాలను విడుదల చేసి ఫిబ్రవరిలో యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. అర్హత గల లబ్ధిదారులు ఆధార్, రేషన్‌కార్డులు, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఏపీఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో ఈ నెల 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.



### ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు..

జిల్లాలోని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకు రుణాలు, లింకేజీ రుణాలు ఇప్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బ్యాంకు లింకేజీ ద్వారా వాహనాలకు రుణాలు ఇవ్వనుండగా, ఈ మేరకు ఇప్పటికే బ్యాంకర్లకు నివేదిక కూడా వెళ్లింది. రూ.లక్ష నుంచి 10లక్షల వరకు లింకేజీ రుణాలు అందే అవకాశం ఉంది. 2019 సంవత్సరానికి ముందు ఎన్ఎఫ్ఎస్‌డీసీ, ఎన్ఎస్‌కేడీసీ పథకాల ద్వారా అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎస్సీ లబ్ధిదారులకు వాహన రుణాలను అందజేసింది. ఎందరో రుణాలు పొంది వాహనాలు కొనుగోలు చేసి జీవనోపాధి పొందారు. సుమారు రూ.25 కోట్ల వరకు రుణాలు లబ్ధిదారులకు అందాయి. ప్రస్తుతం బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా వాహన కొనుగోలుకు ప్రభుత్వం అవకాశం కల్పించనుంది.

### ప్రాధాన్య అంశాలు

చేతివృత్తులు, చిన్నతరహా కుటీర పరిశ్రమలు, వ్యవసాయం, డెయిరీ యూనిట్లకు రుణాలు ఇవ్వనున్నారు. వీటితోపాటు దుకాణాలు ఏర్పాటుకూ అవకాశం కల్పిస్తున్నారు. రాయితీ మొత్తం ప్రభుత్వం ఇవ్వనుండగా మిగిలిన 50 శాతం సాయాన్ని రుణంగా బ్యాంకుల నుంచి ఇప్పించనుంది. ఫ్యాషన్ డిజైనింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, హౌస్‌కీపింగ్, ఫుడ్ అండ్ బేవరేజెస్, సర్వీసెస్ సెక్యూరిటీగార్డులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఇలా వేలాది మందికి రుణాలు, శిక్షణ ఇవ్వడానికి కార్యాచరణ ప్రణాళి కను జిల్లా వెనుకబడిన తరగతులు సేవా సహకార సంఘం లిమిటెడ్ రూపొం దించింది. బీసీ కార్పొరేషన్ ద్వారా 1328 యూనిట్లు, ఈబీసీ కార్పొరేషన్ 91, కమ్మ కార్పొరేషన్ 140, ఆర్యవైశ్య కార్పొరేషన్ 41, క్షత్రియ కార్పొరేషన్ 6, బ్రాహ్మణ కార్పొరేషన్ 32, కాపు కార్పొరేషన్ ద్వారా 231యూనిట్లు మంజూరైనట్లు అధికారు లు తెలిపారు. 50 శాతం సబ్సిడీతో ఈ రుణాలు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు.



## హోరా హోరీగా ఎడ్ల పందేలు

నెల్లూరు రూరల్ మండలం కోడూరుపాడులో శనివారం రాష్ట్రస్థాయి ఎండ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగాసాగాయి. కోడూరు కమలాకర్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ పోటీలను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ప్రారంభించి, మాట్లాడారు. 25 నిమిషాల వ్యవధిలో తెలంగాణలోని సూర్య పేట జిల్లా హుజూర్‌నగర్‌కి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి, సురేంద్రరెడ్డిల ఎడ్లు 2750 అడు గులు 2.25 టన్నుల బరువున్న బండను లాగి తొలివిజేతగా నిలిచాయి. రెండో స్థానంలో కడప జిల్లా మైదుకూరుకు చెందిన కుర్ర వెంకటేష్ యాదవ్ ఎడ్లు, మూడో స్థానంలో గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన తిపగ్నరెడ్డి, జస్విత‌రెడ్డిల ఎడ్లు నిలిచాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా గ్రామంలో ఊళ్లమ్మ అమ్మవారిని ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి దర్శించుకున్నారు.

- నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)

# వడ్డే ఓబన్నకు ఘన నివాళి



వడ్డే ఓబన్నకు నివాళులు అర్పిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), జనవరి 11(ఆంధ్ర జ్యోతి): బ్రిటీష్ పాలనకు వ్యతిరే కంగా నిర్వహించిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తి వడ్డే ఓబన్న అని జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా సంజామల మండలం నొస్సం గ్రామంలో వడ్డే సుబ్బన్న, సుబ్బమ్మ దంపతులకు వడ్డే ఓబన్న జన్మించారని తెలిపారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరులో ఓబన్న సైన్యాధ్యక్షుడిగా వీరోచిత పోరాటం చేశారని వివరించారు. సంచార తెగల సైన్యాన్ని సమర్థవంతంగా నడిపించి, నల్లమల అడవుల్లో సైతం కుంపనీ సైన్యాన్ని ఊచకోత కోసి, ఉరుకులు పెట్టించడంలో ఓబన్న ముఖ్య పాత్ర పోషించిన వీరుడన్నారు. వడ్డే ఓబన్న గ్రామ రక్షకుడిగా పనిచేశారని, ఆ సమయంలో రైతులపై అధిక పన్ను లు విధించడంతో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పేద రైతులు, గ్రామస్థుల హక్కులను కాపాడటానికి, సామాన్యుల హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన్ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసు కోవాలని, వారి జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి దాయ కమని ఎస్పీ పేర్కొ న్నారు.

## రేపటి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

నెల్లూరు(క్రైం), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భోగి పండుగ సంద ర్భంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలంతా గమనించాలని ఆయన పేర్కొన్నారు.

## యూరియా కోసం ఆందోళన వద్దు!

### 'ఆంధ్రజ్యోతి'తో జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి



?: జిల్లాలో ఎన్ని ఎకరాల్లో వరి సాగవుతోంది.

!: జిల్లావ్యాప్తంగా సుమారు 5లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. 90వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుంది. అధికారులు చెప్పిన మోతాదు కంటే అదనంగా వినియోగం ఉంటుంది. ఇప్పటికే దాదాపు 3 లక్షల ఎకరాల్లో వరినాట్లు వేయగా, ఇంకో 2 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

?: యూరియా దిగుమతి. ఎన్ని టన్నులు రైతులకు అందించారు

!: వరి సాగులో యూరియా వివిధ దశల్లో వినియోగిస్తారు. అదేవిధం గా జిల్లాకు కేటాయింపులు ఉంటాయి. జిల్లా అవసరాలకు దాదాపు 90 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుంది. ఇప్పటివరకు దాదాపు 60వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించాము. 17వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉండగా, మరో రెండ్రోజుల్లో ఇంకా వస్తుంది. ఇదీ చాలకుంటే పక్క జిల్లాలకు కేటాయించిన ఎరువు లను కూడా మనం వినియోగిం చుకునేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. యూరి యా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

?: మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముతున్నారు కదా

!: ప్రభుత్వం నిర్ణయించిన ధరకన్నా ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశాం. రైతుల అవ సరాలను అవకాశంగా తీసుకుని అధిక ధరలకు విక్రయాలు సాగి స్తే లైసెన్సులు రద్దు చేస్తాం.

?: అధిక ధరల విక్రయాలపై తీసుకున్న చర్యలు

!: అధిక ధరకు యూరియాను విక్రయిస్తున్న వ్యాపారు లపై చర్యలు తీసుకుంటున్నాం. సంగం లో రెండు, పొదలకూరులో మరో రెండు దుకాణాల నిర్వాహకులపై చర్యలు తీసుకున్నాం. యూరియా ను స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ధరకు రైతులకు విక్రయిం చాము. వారి వ్యాపార లావా దేవీలను ఆపేశాము కూడా.

ఈ అంతరంగం

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

## ఉత్తర్వులన్నీ బేఖాతర్!

### మోపాడు చెరువులో చేపల పెంపకం

### మత్స్యశాఖ అధికారుల అత్యుత్సాహం

### ఏమీ పట్టనట్టు ఉన్న పంచాయతీ అధికారులు

### బహిరంగ వేలం నిర్వహణలో మీనమేషాలు

కందుకూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సాక్షాత్తూ రాష్ట్ర హైకోర్టు వెలువరించిన తీర్పును, కలెక్టరు జారీచేసిన ఉత్తర్వులను బేఖాతర్ చేస్తూ డివిజన్‌స్థాయి అధికారులు అడుగులు వేస్తు న్నారు. కందుకూరు మండలంలో అత్తాకోడళ్ల చెరువులుగా ప్రసిద్ధి చెందిన మాచవరం, మోపాడు చెరువు లలో ఒకటైన మోపాడు చెరువులో చేపల పెంపకం వ్యవహారం కొన్నేళ్లుగా రెండు పంచా యతీల మధ్య వివాదం ఏర్పడగా ఈ సమస్య పరిష్కారానికి హైకోర్టు స్పష్టమైన మార్గనిర్దేశాలు ఇచ్చింది. మోపాడు చెరువు మోపాడు, కొండముడు సుపాలెం రెవెన్యూల పరిధిలో విస్తరించి ఉండగా అందులో అధిక భూభాగం కొండముడుసు పాలెం రెవెన్యూ పరిధిలోనే ఉంది. అయితే పేరుకు మోపాడు చెరువు కనుక అందులో వస్తున్న చేపల ఆదాయాన్ని కొన్ని దశాబ్దాలుగా మోపాడు పంచాయతీకే దక్కుతుండటాన్ని సవాల్ చేస్తూ కొండముడు సుపాలెం సర్పంచ్ తుమ్మా కోటేశ్వరమ్మ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో 2022 జూన్ 20న చెరువు విస్తీర్ణం ఏ రెవెన్యూ పరిధిలో ఎంత ఉంది, చెరువు ఆయకట్టు ఏ గ్రామంలో ఎంత ఉందో పరిశీ లించి తదనుగుణంగా చేపల ఆదాయా న్ని రెండు పంచాయతీలకు పంచాలని ఉత్తర్వులు జారీచేసింది. ఆ మేరకు అప్పటి కలెక్టరు చక్రధర్‌బాబు పలు దఫాలు రెండు పంచాయతీల సర్పంచ్‌లు, గ్రామస్థులతో సమావేశాలు నిర్వహిం చి, వారి అభిప్రాయాలు తీసుకున్నారు. అంతేగాక ఫిబ్రవరి 7న రెండు గ్రామాలలో గ్రామసభ లు నిర్వహించి ప్రజాభి ప్రాయం కూడా సేకరిం చారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి, ఇరిగేషన్ ఎస్‌ఈ, ఫిషరీస్ జేడీలతో ఓ కమిటీని ఏర్పాటుచేసి వారి నివేదిక ఆధారంగా రెండు పంచాయతీల మధ్య చేపల ఆదాయం హక్కును విభజిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2023 మేలో చేపల ఆదాయంలో కొండముడు సుపాలెంకు 61 శాతం, మోపాడు పంచా యతీకి 39 శాతం చెందుతుందని ఆ ఉత్త ర్వుల్లో పేర్కొన్నారు. ఆ మేరకు ఫిషరీస్ జేడీ ఖాతాలో ఉన్న చేపల నిధులను పంచాయ తీలకు పంచాలని కూడా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే కింది స్థాయి అధికారులు వాటన్నిటినీ పక్కనపెట్టి పాత పద్ధతిలోనే చేపల ఆదాయం మోపాడుకే దక్కేలా చేపల పెంపకం చేపట్టేందుకు సన్నాహాలు ప్రారం భించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. చేపల వేలం పెట్టుకుని నిధులు జమచేసుకునే హక్కును మోపాడుకు కట్టబెడు తూ కావలి ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి డిసెంబరు 26న మోపాడు నుంచి మత్స్యశా ఖకు ఫీజును కట్టించుకున్నారు. రూ.2.29 లక్షలు మోపాడు పంచాయతీ నుంచి జమ చేసుకుని వారికి హక్కులు కల్పించటం విశేషం.



మోపాడు చెరువు ఇదే!

- **నాలుగేళ్లుగా మూలుగుతున్న నిధులు**

కాగా చేపల పెంపకం ఆదాయంపై రెండు పంచాయతీల మధ్య వివాదం నెలకొన్న నేపథ్యంలో నాలుగేళ్లక్రితం చేపల వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని అప్పట్లో కలెక్టరు సీజ్ చేసి మత్స్యశాఖ జేడీ ఖాతాలో జమ చేయిం చారు. 2021లో ఈ చెరువు చేపల బహిరంగ వేలం నిర్వహించగా రూ.22 లక్షలకు పాట పాడుకున్నారు. ఆ మొత్తం మోపాడు పంచా యతీకి జమ చేయడాన్ని సవాల్‌చేస్తూ కొండ ముడుసుపాలెం పంచాయతీ కోర్టును ఆశ్రయిం చటంతో నిధులను కలెక్టరు సీజ్ చేయించారు. అనంతర పరిణామాలలో హక్కుల విభజన జరిగినా ఆ నిధుల పంపిణీ నేటికీ జరగలేదు. ఆ వ్యవహారం అలా ఉండగానే ఈ ఏడాది చేపల పెంపకం హక్కును విభజన ఉత్తర్వు లకు అనుగుణంగా రెండు పంచాయతీలకు చెందేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఏకపక్షంగా వ్యవహరించటంలో ఆంతర్యం ఏమిటన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అంతేగాక చేపలు బహిరంగ వేలం పెట్టకుండా కాలయాపన చేస్తుండటం కూడా అనుమా నాలకు తావిస్తోంది. కలెక్టరు ఉత్తర్వులను అనుగుణంగా మత్స్యశాఖ, డివిజనల్ పంచాయతీ అధికారులు రెండు గ్రామ పంచాయతీల నేతృత్వంలో చేపల వేలం నిర్వహించి ఎవరి హక్కుమేరకు వారికి నిధులు జమ చేయటంతోపాటు పాత నిధుల పంపిణీ కూడా పూర్తిచేయాలని కోరుకుంటున్నారు.

# అవనిపై హరివిల్లు

## విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

### ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

### కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

### 11 మందికి కన్సొలేషన్ బహుమతులు

### బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ







ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ





ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత







కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మీ (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

## అలరించిన
# సంక్రాంతి కవి సమ్మేళనం

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రేబాలవారివీధిలో ఉన్న జిల్లా గ్రంథాలయ సంస్థలో శనివారం జరిగిన కవి సమ్మేళనం జరిగింది. నెల్లూరు రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సంక్రాంతి సంబరాలపై కవులు తమ కవిత్వాన్ని వినిపించారు. అలాగే సంస్కృతి, సంప్రదాయాలు గురించి కూడా కవితలు చదివారు. కార్యక్రమానికి నెరసం జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ అధ్యక్షత వహించారు. సభా కార్యక్రమ నిర్వహణను ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ చేశారు. అతిథులుగా మెట్టు రామచంద్ర ప్రసాద్, చెలంచర్ల భాస్కర్‌రెడ్డి, నలుబోలు బలరామయ్య, చీమకుర్తి వెంకటేశ్వరరావు, పోలాప్రగడ లక్ష్మీనరసింహంలు పాల్గొన్నారు. నెరసం సభ్యులు షేక్.నజ్మా, భారతి, అరుణ సందడి, శశికళ, గీతాంజలి శ్రీమన్నారాయణ, శ్రీనివాసులు, రత్నప్రసాద్, దయాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కవులందరినీ సత్కరించారు.

## కమనీయం పెంచలోన కళ్యాణం

పెంచల కోనలో శనివారం చెంచులక్ష్మి, ఆదిలక్ష్మీ సమేత నరసింహస్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఈ వేడుకను తిలకించారు. అనంతరం తిరుచ్చి పల్లకీసేవ, ఊంజల్ సేవ నిర్వహించినట్లు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

– రాపూరు, (ఆంధ్రజ్యోతి)



ఎక్కడో అడవుల్లో.. జంతుపార్కుల్లో కనిపించే చుక్కల దుప్పులు శనివారం బిట్రగుంట రైల్వేస్టేషన్ సమీపంలో గుంపులుగా కన్పించాయి. స్థానిక ప్రజలతో పాటు, రైలు ప్రయాణికులు వీటిని చూసేందుకు ఆసక్తిచూపారు. నీరు.. ఆహారం దొరక్క, ఇలా జనావాసాలకు సమీపంలోకి వచ్చాయా లేదా గుంపు తప్పి ఇలా వచ్చాయో తెలియడం లేదని స్థానికులు చర్చించుకున్నారు.

– బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి)



## గుంపులుగా చుక్కల దుప్పులు



# ఆవు మాంసం పట్టివేత

- కేరళకు తరలిస్తుండగా స్వాధీనం
- రూరల్ పోలీసు అదుపులో వాహనం



స్వాధీనం చేసుకున్న వాహనంతో మున్సిపల్ అధికారులు

నెల్లూరు(సిటీ), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నుంచి కేరళకు ఆవు మాంసం తరలించే ముఠాను మున్సిపల్ అధికారులు శనివారం పట్టుకున్నారు. నెల్లూరు రూరల్ పరిధిలోని సౌత్‌రాజుపాళెం సమీపంలోని ఓ లేఅవుట్‌లో ముక్కలు చేసిన ఆవు మాంసాన్ని సంచుల్లో వాహనంలో లోడ్ చేస్తుండగా స్థానికులు మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వాహనాన్ని స్వాధీనం చేసుకుని పరిశీలించగా, ఆవు మాంసమని ఎన్ఎంసీ పశువైద్యుడు మదన్‌మోహన్ తేల్చారు. సుమారు ఐదు టన్నుల వరకు ఉంటుందని, దీని విలువ రూ. 15 లక్షల వరకు ఉండవచ్చని ఆయన తెలిపారు. ఈ మాంసాన్ని తరలించడానికి ఎలాంటి అనుమతులు లేని కారణంగా, దొంతాలి డంపింగ్ యార్డు వద్దకు తీసుకెళ్లి ఫినాయిల్‌తో నిర్వీర్యం చేసినట్లు చెప్పారు. అనంతరం వాహనాన్ని రూరల్ పోలీసులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య ఆయన బృందం పాల్గొన్నారు. కాగా వాహనదారుడికి గతంలో జంతు ప్రదర్శనశాలలకు మాంసం తరలించే లైసెన్సు ఉండేదని, అది కాలపరిమితి తీరిందని తమ దర్యాప్తులో తేలినట్లు సీఐ జీ వేణు తెలిపారు. విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

## వేధింపుల కేసులో ఒకరి అరెస్ట్

నెల్లూరురూరల్,జనవరి 11,(ఆంధ్రజ్యోతి): ఓ యువతిని మానసికంగా వేధించి ఆమె మరణానికి కారణమైన ఓ వ్యక్తిని నెల్లూరు రూరల్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. సీఐ జీ వేణు కథనం మేరకు, రెండో డివిజన్ గుడిపల్లిపాడు ప్రాంతానికి చెందిన యువతి నెల్లూరులోని ఓ ప్రైవేట్ సంస్థలో పని చేసేది. ప్రేమిస్తున్నానంటూ ఆమెను అదే ప్రాంతానికి చెందిన దార్ల వెంటరమణ వేధించేవాడు. దీంతో ఆమె అతడి ఫోన్ నెంబరును బ్లాక్ చేయగా మరొకరి నెంబరు నుంచి మెసేజ్‌లు పెడుతూ వేధింపులకు గురి చేసేవాడు. ఈ క్రమంలో ఆమె ఈ నెల 7న డ్యూటీ నుంచి ఇంటికి వచ్చి గదిలోనే ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలి తండ్రి మౌలాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, వెంకటరమణను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

## పోలీసుల అదుపులో జేబుదొంగ

సంగం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బస్సు ఎక్కే ప్రయాణికుని జేబులో నగదు కొట్టేసిన దొంగను స్థానికులు పట్టుకుని సంగం పోలీసులకు అప్పగించిన సంఘటన శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. సంగం గ్రామానికి చెందిన నేలటూరు రమణయ్య అనే వ్యక్తి రూ. 5000 నగదు చొక్కా జేబులో పెట్టుకుని నెల్లూరు వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చాడు. ఇంతలో బస్సు రావడంతో ఎక్కుతుండగా ఓ వ్యక్తి డోర్ వద్ద నిలబడి రమణయ్య భుజంపై టవల్ వేసి జేబులోని నగదు కొట్టేసి పది అడుగులు వెనక్కి వెళ్లి ఫిట్స్ వచ్చినట్లు పడిపోయాడు. ఈవిషయాన్ని పక్క షాపులో కూర్చొని ఉన్న ఓ యువకుడు గమనించి ఫిట్స్ వచ్చినట్లు నటిస్తున్న వ్యక్తిని పట్టుకుని నిలదీసి నగదు స్వాధీనం చేసుకుని పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి నిందితుడ్ని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడు పాత నేరస్థుడిగా సంగం పోలీసులు గుర్తించారు. అదేవిధంగా అంతకుముందు ఓ ప్రయాణికుడు బస్సు ఎక్కే క్రమంలో జేబులో ఉన్న రూ. 2000 నగదు మాయమైందని, మరో ప్రయాణికుడు తన జేబులోని కీ ప్యాడ్ ఫోన్ పోయిందని బస్టాండ్‌లో చెప్పడంతో కలకలం రేగింది. ఈ రెండు సంఘటనలు నిందితుడ్ని పట్టుకోక ముందే జరిగాయి. ఇవి పట్టుబడిన నిందుతుడి వద్ద లేవు. దీంతో ఇతనితోపాటు మరికొందరు జేబుదొంగలు సంగంలో సంచరిస్తున్నట్లు అనుమానం వ్యక్తం చేసి గాలించగా ఆచూకీ లభ్యం కాలేదు.



పోలీసులు అదుపులోకి తీసుకున్న జేబుదొంగ

## ప్రయాణికురాలి నగల సంచి మాయం

- పోలీసులకు ఫిర్యాదు

సంగం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికురాలి నగల బ్యాగ్ మాయమైన సంఘటన శనివారం జరిగింది. ఈమేరకు బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. ఏయస్‌పేట మండలం కొండమీద కొండూరుకు చెందిన కె కమలాకర్‌రెడ్డి, శిరీష దంపతులు వ్యాపార రీత్యా నెల్లూరులో ఉంటున్నారు. సంక్రాంతి పండుగకు స్వంత ఊరికి వెళ్లేందుకు శనివారం ఉదయం 5 గంటల ప్రాంతంలో భర్త కమలాకర్ భార్య శిరీషను బస్సు ఎక్కించేందుకు ఆత్మకూరు బస్టాండ్‌కు వచ్చారు. ఆత్మకూరు వైపు వెళ్లే బస్సు రావడం ఆలస్యం కావడంతో బస్సు వస్తే ఎక్కి వెళ్లు.. నేను తరువాత వస్తానని చెప్పి తిరిగి ఇంటికి వెళ్లాడు. ఇంతలో ఆత్మకూరు వెళ్లే పల్లెవెలుగు బస్సు రావడంతో తన చేతిలోని నగల బ్యాగ్‌ను బట్టల బ్యాగ్‌లో పెట్టి బస్సు ఎక్కింది. కాగా, బస్సులో ఎక్కిన తరువాత చూసుకుంటే బట్టల బ్యాగ్ జిప్ తెరుచుకుని ఉంది. నగల బ్యాగ్ గురించి పట్టించుకోకుండా జిప్ వేసి కూర్చొంది. దామరమడుగు దాటిన తరువాత నగల బ్యాగ్ గుర్తుకొచ్చి చూసుకోగా కనిపించ లేదు. దీంతో తన నగల బ్యాగ్ కనిపించడం లేదని రచ్చ చేయడంతో తోటి ప్రయాణికులు కండక్టర్‌కు తెలిపారు. అప్పటికే బస్సు బుచ్చిరెడ్డిపాళెం దాటి సంగం సమీపంలో ఉంది. ఈవిషయం తెలుసుకున్న బాధితురాలి భర్త సంగం పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే ఎస్ఐ రాజేష్ తన సిబ్బందితో రోడ్డు మీదకు వచ్చి బస్సును నిలిపి అందులో ప్రయాణికులందరినీ, వారి బ్యాగ్‌లను తనిఖీ చేశారు. కానీ నగల బ్యాగ్ కనిపించలేదు. బ్యాగ్‌లో సుమారు 10 సవర్ల బంగారు ఆభరణాలు ఉన్నట్లు బాధితురాలు తెలిపింది. ఆమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

### చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 120 |
| లేయర్ లైవ్ | 85 |
| స్కిన్ చికెన్ | 218 |
| స్కిన్‌లెస్ | 240 |
| లేయర్ | 145 |

### బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.7530 |
| వెండి కిలో ధర | రూ. 93,100 |
| వెండి ఒక గ్రాము | రూ.96.10 |

- అతిథులకు ఉపయోగపడని భవనం
- ఫర్నీచర్, కనీస వసతులు కరవు
- ఒక్కసారైనా ఉపయోగిస్తే ఒట్టు

## లక్షలు వెచ్చించి..
# ఇలా వదిలేసి..

ఈ చిత్రంలో కనిపిస్తున్న భవనం ప్రభుత్వానికి సంబంధించినదే. అయితే ఇది ఏ కార్యాలయం అన్నది ఆ భవనంపై రాయలేదు. దీంతో లక్షలు వెచ్చించి నిరుపయోగంగా వదిలేసిన ఈ భవనం పలానా అని తెలిసే అవకాశం కూడా లేదు. అయితే దీనిని గత వైసీపీ ప్రభుత్వంలో 2022లో అప్పటి వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. తీరా లోపలకి వెళ్లి చూస్తే అక్కడంతా డొల్లే.. అందులో ఫర్నీచర్ లేదు. కనీస వసతులు లేవు. చివరికి ఈ భవనానికి వాచ్‌మెన్ కూడా లేడు. మంత్రి ప్రారంభించిన తరువాత ఇప్పటి వరకు ఒక్కరంటే ఒక్కసారి కూడా దీనిని ఉపయోగించలేదు. ఇంకో విషయం ఏమిటంటే ప్రారంభం తరువాత అప్పటి మంత్రి పలు దఫాలుగా ఎంపీడీవో కార్యాలయంకు వచ్చినా ఆయన కూడా ఈ భవనంలో విశ్రాంతి తీసుకోలేదు. దీంతో లక్షలు పోసినా దీని లక్ష్యం నెరవేరలేదు. అయితే ఈ భవనం కోసం ఇప్పటి వరకు రూ.33 లక్షలు ఖర్చుచేసినట్లు పంచాయతీ రాజ్ అధికారుల లెక్క.

- 17 ఏళ్లకు నిర్మాణం పూర్తి

2005లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి జడ్పీ చైర్మన్ చెంచలబాబు యాదవ్ ఈ పంచాయతీ రాజ్ అతిథిగృహంకు రూ.3 లక్షలు విడుదల చేయగా అప్పటి కేంద్ర ఆరోగ్యశాఖ సహాయమంత్రి పనబాక లక్ష్మి శంకుస్థాపన చేశారు. తరువాత జిల్లా పరిషత్ చైర్మన్‌గా కాకాణి గోవర్ధన్‌రెడ్డి జడ్పీ నిధుల నుంచి మరో రూ.5లక్షలు కేటాయించారు. ఆ నిధులు సరిపోకపోవడంతో అప్పటి ఎమ్మెల్యే ఈ భవనం కోసం రూ.10లక్షలు మంజూరు చేయించారు. దీంతో రూ.18 లక్షలకు రెండు అంతస్తుల భనవం అరకొరగా నిర్మించారు. ఈ భవనం దుస్థితిని 2022లో మంత్రి కాకాణి దృష్టికి తీసుకెళ్లగా ఆయన మరో రూ. 15లక్షలు జడ్పీ నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో భవనంకు కావల్సిన తలుపులు, కిటికీలు, రంగులు వేసి తళతళ మెరిసేలా చేశారు. 17 ఏళ్లల్లో రూ.33లక్షలతో భవనం పూర్తి చేశారు. అయితే గృహంలో సోఫాలు, కుర్చీలు, వంటగది సామాగ్రి, పడకగది సామగ్రి ఏమీ సమకూర్చలేదు. ఇంతకీ ఇది ఎందుకు నిర్మించారో తెలుసా అతిథుల విడిది కోసం.. అతిథులు అంటే ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు,



బోర్డు లేని పంచాయతీ రాజ్ అతిథి గృహం

అధికారులు మనుబోలు మీదుగా వెళ్లే సమయంలో సేదతీరాల్సివస్తే ఈ భవనం వారికి అప్పగించి సేవలు అందించిందేకు నిర్మించారు.

- త్వరలో స్కిల్ సెంటర్ ఏర్పాటు

ప్రస్తుతం పంచాయతీరాజ్ అతిథి గృహం కింద భాగంలో ఒకగదిని 108, 104 సిబ్బంది తలదాచుకుంటున్నారు. ప్రస్తుతం ఈ భవనంకు వీరే అతిథులు. ఇటీవల మండల పరిషత్ కార్యాలయంకు వచ్చిన జడ్పీ సీఈవో ఈ అతిథి గృహంను పరిశీలించి వెళ్లారు. త్వరలో స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారని, అందుకు ఈ భవనంలోని పై అంతస్తులో ఏర్పాటు చేయిస్తామని చెప్పినట్లు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అతిథి గృహంకు కావాల్సిన వసతులకు మరిన్ని నిధులు కేటాయించి వినియోగంలోకి తెస్తారా..? లేక స్కిల్ సెంటర్ ఏర్పాటు చేస్తారా..? ప్రొటోకాల్ ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చినప్పుడు వారికైనా కేటాయిస్తారా వేచిచూద్దాం.

– మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

## బాలయ్య అభిమానులకు
# ముందుగానే పండగొచ్చింది..!




ఎస్2 సినిమాహాల్ వద్ద ఏర్పాటు చేసిన బాలకృష్ణ కటౌట్

- నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు బాలయ్యబాబు అభిమానులకు సంక్రాంతి పండుగ ముందే వచ్చిందని నుడా చైర్మన్, ఎన్‌టీకే సేవా సమితి జిల్లా కన్వీనర్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం డాకు మహారాజ్ సినిమా విడుదల సందర్భంగా శనివారం నగరంలోని ఎస్2 సినిమా హాలు వద్ద 36 అడుగుల బాలకృష్ణ కటౌట్ ఏర్పాటు చేసి, 300 కేజీల గజమాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్ర పరిశ్రమకు బాలయ్యబాబు ఎప్పుడూ రారాజే అన్నారు. నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ సినిమా ఇండస్ట్రీ రికార్డులను బద్దలు కొట్టడం ఖాయమన్నారు. అన్నీ వర్గాల ప్రజలకు మెచ్చేలా ఈ సిని మా ఉండబోతున్నదని, బాలకృష్ణ చెప్పిన మాస్ డైలాగ్స్, సోషల్ మీడియాలో ఇప్పటికే ట్రెండ్ అవుతున్నాయని పేర్కొన్నారు. బాలకృష్ణ సినిమా విడుదల అవుతుందంటే తనలాంటి అభిమానులకు పెద్ద పండుగేనని ఆయన తెలిపారు.

## గోవుల కుమ్ములాట..
# చిన్నారికి తప్పిన పెను ప్రమాదం!

- బస్టాండులో యథేచ్ఛగా ఆవుల సంచారం

పొదలకూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో శనివారం సాయంత్రం రెండు గోవులు కుమ్ములాటకు దిగాయి. ఎంతమంది వాటిని అదుపు చేయాలని చూసినా.. మొరటుగా ప్రవర్తిస్తూ రక్తం వచ్చేలా ఒకదాన్ని మరొకటి కొమ్ములతో పొడుచుకున్నాయి. వీటి కుమ్ములాట దాటికి పార్కింగ్ చేసి ఉన్న ఓ కారు అద్దం (మిర్రర్) సైతం పగిలిపోయింది. దాంతో స్థానికులు భయాందోళనతో పరుగుతు తీశారు. ఈ నేపథ్యంలో ఒక బాలికపైకి రెండు గోవులు వేగంగా దూసుకువచ్చాయి. స్థానికులు అప్రమత్తమై బాలికను పక్కకు నెట్టేయగా రెప్పపాటులో పెద్ద ప్రమాదం తప్పింది. లేదంటే పరిస్థితి ఘోరంగా ఉండేది. ఈ ఆవులతో ఇలాంటి సమస్యలే కాకుండా నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయంగా మారుతూ వాహదారులు ఇక్కట్లు పడుతున్నారు. ఈ



బస్టాండులో కుమ్ముకుంటున్న ఆవులు

సమస్య ముఖ్యంగా నెల్లూరు రోడ్డులోని స్వర్ణ లే అవుట్, ఆర్టీసీ బస్టాండ్, సంగం రోడ్డు పెట్రోలు బంక్ సెంటర్, పంచాయతీ బస్టాండు వద్ద తీవ్రంగా ఉంది. మూగజీవాల యజమానులు స్పందించి వాటిని తోలుకొని వెళ్లాలని లేని ఎడల సంబంధిత అధికారులు గానీ, రాజకీయ నాయకులు గానీ చొరవ చూపి వాటిని కనీసం గోశాలకు తరలించి వాటి వలన ఎదురయ్యే ప్రమాదాలను అరికట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## 20న జిల్లాస్థాయి పారా క్రీడల ఎంపికలు

కావలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా పారా క్రీడల కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 20న నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లాస్థాయి పారా క్రీడల పోటీల ఎంపికలు జరుగుతాయని కమిటీ జిల్లా అధ్యక్షుడు టీసీ మాల్యాద్రి నాయుడు తెలిపారు. శనివారం స్థానిక జర్నలిస్టుక్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లలోని దివ్యాంగులు ఈ ఎంపికలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎంపికైన క్రీడాకారులు జనవరి 30న గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయిలో అర్హత సాధించిన క్రీడాకారులకు జాతీయస్థాయి పోటీలో పాల్గొనే అవకాశం ఉందన్నారు.

## ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

నెల్లూరు(క్రైం), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఓ యువకుడి వద్ద నుంచి రూ.లక్షల్లో నగదు తీసుకొని మోసగించిన వ్యక్తిపై నగరంలోని చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు, జెండావీధికి చెందిన శ్రీనివాసులు ఎంఎస్సీ కంప్యూటర్ పూర్తిచేసి ఉద్యోగం వేటలో ఉన్నాడు. ఏడాది కిందట ఆయన ఇంటి సమీపంలోని యువతి ద్వారా సాఫ్ట్‌వేర్ కంపెనీ యజమాని పేరిట అనూక్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. అతను తన కంపెనీలో ఉద్యోగం ఇస్తానని శ్రీనివాసులు వద్ద రూ.4లక్షలు తీసుకున్నాడు. రోజులు గడుస్తున్నా ఉద్యోగం ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చాడు. బాధితుడు కంపెనీ గురించి ఆరా తీయడంతో అసలు కంపెనీయే లేదని తెలిసింది. తనను మోసగించిన అనూక్‌పై చర్యలు తీసుకోవాలని శనివారం బాధితుడు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుంజులూరుపాడు రైల్వే గేటు సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా గూడూరు మండలం చెన్నూరు ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు, సురేష్‌లు కృష్ణపట్నం పోర్టుకు పనిపై వెళ్లి తిరిగి మోటర్ బైక్‌పై వస్తుండగా పోర్టు రోడ్డుపై షడన్‌గా గేదేలు అడ్డురావడంతో వాటిని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సర్వేపల్లిలోని ఒక ప్రైవేటు క్లీనిక్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఏపీటీఎస్ఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక




ఎన్నికైన ఏపీటీఎస్ఏ కార్యవర్గం

నెల్లూరు (హరనాదపురం) జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీటీఎస్ఏ) జిల్లాశాఖ కార్యవర్గాన్ని శనివారం జిల్లా ట్రెజరీ కార్యాలయంలో, ట్రెజరీ అధికారుల సమక్షంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎడవల్లి దయాకర్, అసోసియేట్ అధ్యక్షుడిగా షేక్.జిలానిబాషా, ఉపాధ్యక్షులుగా ఊరిబిండి వెంకటరమణారావు, షేక్.అబ్దుల్‌అలీమ్, కోటపురి వివేక్‌ను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా బూడిద శ్రీనివాసులు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా విడవలూరు కిరణ్, సంయుక్త కార్యదర్శులుగా కలివే కోసలరాం, శ్రీకంట సాయిశ్రీవాత్సవ్, ట్రెజరర్‌గా వాకాటి రాజేష్‌బాబును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లా ఖజానా శాఖ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర అధ్యక్షుడు గోవింద రవికుమార్, ప్రధాన కార్యదర్శి కే రాజకుమార్‌ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఎన్నికైన నాయకులను ట్రెజరీ అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

## కాలువలో పడి గిరిజనుడి మృతి

అల్లూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇస్కపల్లి పంచాయతీ ఆదిరాఘవపురం సమీపంలోని జువ్వలదిన్నె కాలువలో ప్రమాదవశాత్తు పడి అల్లూరు పరిధిలోని ఉదీపగుంటకు చెందిన పొట్లూరు మస్తాన్ (53) మరణించాడు. ఎస్ఐ కిషోర్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. ఈయనకు చిన్నతనం నుండి మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. శుక్రవారం సాయంత్రం ఈయన బహిర్భూమికని వెళ్లి ఇంటికి రాలేదు. రాత్రి అవడంతో భార్య పొట్లూరు మల్లీశ్వరి చుట్టుపక్కలంతా గాలించింది. పలువురిని విచారించినా కన్పించలేదు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి వెతకడంతో కాలువలో పడి ఉన్నట్లు గుర్తించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



పొట్లూరు మస్తాన్ మృతదేహం

## డీఏ, పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలి

నెల్లూరు (హరనాథపురం) జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఉద్యోగులకు డీఏ, పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని విశ్రాంత సోషల్ వెల్ఫేర్ అధికారి, భారత సేవా ఫౌండేషన్ కార్యదర్శి షేక్.ఖాసి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. సంక్రాంతి కానుకగా ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడం హర్షణీయ మన్నారు. అలాగే విశ్రాంత ఉద్యోగులకు కూడా పీఆర్సీ, డీఏ బకాయిలను చెల్లించి వృద్ధాప్యంలో ఉన్నవారిని ఆదుకోవాలని కోరారు.



### పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి

## కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

- గత వైసీపీ పాలనలో బిందుసేద్యం రాయితీకి రాంరాం...
- కూటమి ప్రభుత్వం మంజూరుకు చర్యలు
- అర్హులనుంచి దరఖాస్తుల ఆహ్వానం

# ఎన్నాళ్లకెన్నాళ్లకు..



గట్టుపల్లి చింతలపాలెంలో బిందుసేద్యంతో సాగవుతున్న వంగతోట

జలదంకి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బోర్లు, బావుల పంటలు సాగుచేస్తున్న మెట్టపంటల రైతులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు సూక్ష్మ నీటిపారుదల ప్రాజెక్ట్ (ఏపీఎంఐపి) ద్వారా రాయితీతో చిన్న, సన్నకారు రైతులకు బిందు సేద్యం పరికరాలు పంపిణీ చేయగా కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని తిరిగి ప్రారంభిస్తూ రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. రాయితీ ఎపుడు ఇస్తారా అని ఎదురుచూస్తున్న మెట్ట ప్రాంతాల అన్నదాతలు రైతుసేవా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటున్నారు.

● బహుళ ప్రయోజనాలివే:

వ్యవసాయబోర్లు, బావుల కింద కూరగాయలు, పండ్లతోటలు సాగుచేసేవారు సూక్ష్మ సేద్యంతో పంటల సాగులో నీటివృథాను నూరుశాతం అరికట్టడంతో పాటు అధిక విస్తీర్ణంలో సాగుచేయవచ్చు. సాగుచేసిన మొక్కలు, పైరు ఏపుగా ఎదిగి అధిక దిగుబడులు వస్తాయి. తుంపర్ల (స్ప్రింక్లర్ల) ద్వారా పంటకు సాగునీరు పెడితే గాలిలో నీరు నత్రజనిని తీసుకుని పైరుపై నీరు చల్లినట్లు పడడంతో పైరు బాగా పెరిగుతుంది. అదే ఈ పంటలకు నేరుగా నీటితడులు ఇస్తే నీటివృథాతో పాటు సాళ్ల మధ్యలో కలుపు మొక్కలు మొలచి పైరు ఎదుగుదలను నిలువరిస్తుంది. ఈ బాధలను డ్రిప్ సాగుతో తప్పించవచ్చు. అంతేకాక రసాయనిక ఎరువులు డ్రిప్ ద్వారా నేరుగా నీళ్లతో కలసి మొక్కకు అందించవచ్చని అధికారులు చెబుతున్నారు.

● రాయితీ ఇలా పొందొచ్చు:

ప్రభుత్వ రాయితీ పొందాలంటే రైతులు పొలం పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, వ్యక్తిగత బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్సు కాపీలు తీసుకుని స్థానిక రైతుసేవా కేంద్రాలకు వెళ్లి ఏవీఎంలను సంప్రదించాలి. లేదా కామన్ సర్వీస్ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యవసాయభూమిలో బోరు లేదా బావి నిర్మించి ఉంటే ఈ పథకం కింద అర్హులవుతారు.

● రాయితీ వివరాలిలా ఉన్నాయి:

బిందు (డ్రిప్)సేద్యంకు 5ఎకరాలలోపు రైతులకు 90శాతం రాయితీతో రూ.2.18లక్షల సూక్ష్మ సేద్య పరికరాలందుతాయి. 10ఎకరాలలోపు రైతులకు 70శాతం రాయితీతో రూ.3.46లక్షల పరికరాలు పొందుతారు. అదే తుంపర్ల (స్ప్రింక్లర్ల) సేద్యంకు 5ఎకరాలలోపు పొలం ఉన్న రైతులకు 55శాతం రాయితీ పొందవచ్చు. 10ఎకరాలలోపు ఉన్న రైతులు 45శాతం రాయితీ పొందడంతో పాటు పరికరాలు ఎంచుకునే వీలుంది.

## రోగులకు మెరుగైన వైద్యసేవలు

● డాక్టర్ కేవీ శేషారత్నం



ఇంటర్వ్యూ...

ఆత్మకూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలలో కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. వైద్యశాల అభివృద్ధిపై రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టి సారించి మరిన్ని వసతుల కల్పనకు కృషి చేస్తున్నారని సూపరింటెండెంట్ కెవి శేషారత్నం తెలిపారు.

? అభివృద్ధికి చర్యలేవి.

! త్వరలో ఎమ్మారై, సిటీ స్కానింగ్ మిషన్‌లు అందుబాటులోకి తెస్తాం. అందుకు అవసరమైన గదిని సిద్ధం చేసి ఉంచాం. బ్లడ్‌బ్యాంకు ఏర్పాటుకు లైసెన్సు వచ్చింది.

? వైద్యశాలలో ఎన్ని విభాగాలు ఉన్నాయి.

! ఆసుపత్రిలో 13 విభాగాలున్నాయి. ప్రస్తుతం 100పడకలు మాత్రమే ఉన్నాయి. 200పడకలు ఏర్పాటుకు కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి ఆనం వెల్లడించడం హర్షదాయకం.

? సిబ్బంది కొరత ఉందా.

! వైద్యశాలలో 8 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గైనకాలజీ విభాగంలో ముగ్గురు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం.

? వైద్యశాలలో మందుల కొరత పరిస్థితి ఏమిటి.

! వైద్యశాలలో మందుల కొరత లేదు. హెచ్ఎంపీవి వైరస్ పట్ల అప్రమత్తంగా ఉన్నాం. మాస్కులు, శానిటైజర్లు, గ్లూకోమీటర్లు, పల్స్ ఆక్సీమీటర్లు, ఆక్సిజన్ పైపులైను, సిలిండర్లు, యాంటీవైరల్‌కు సంబంధించిన మందులన్నీ అందుబాటులో ఉన్నాయి.

## ఆర్థిక సాయం

దుత్తలూరు(ఉదయగిరి), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నర్రవాడ బీసీ కాలనీ నవరం వెంగయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో దాతలు అందజేసిన రూ.30 వేల నగదును ఎస్ఐ ఆదిలక్ష్మి శనివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. జిల్లా కిసాన్ మోర్చా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు మేకపాటి శ్రీనివాసులకు వివరించడంతో స్పందించిన ఆయన నగదును ఇచ్చారు.కార్యక్రమంలో తెడ్డుపాడు సర్పంచ్ బోయపాటి వెంకటరత్నం, మండల తెలుగు యువత తులసీరామ్ ఉన్నారు.

## మద్యం దుకాణం ప్రారంభం

ఉదయగిరి రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గండిపాళెంలో కొనసాగిన వర్గ విభేదాలకు శనివారం తెరపడింది. ఉదయగిరిలోని దుకాణాన్ని గ్రామానికి తరలించి ప్రారంభించారు. విషయం తెలుసుకొన్న మందుబాబులు మద్యం కొనుగోలు చేసేందుకు బారులు తీరడంతో సందడి నెలకొంది.

## పేకాట స్థావరంపై దాడి

కందుకూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పలుకూరు సమీప పొలాల్లో నడుస్తున్న పేకాట శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. అనంతరం వారి వద్ద రూ.19,400ల నగదు, ఆరు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

● ఉదయగిరి: దుర్గం అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న జూదస్థావరంపై సీఐ ఎన్ వెంకటరావు, ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డిలు సిబ్బందితో దాడులు నిర్వహించారు. నలుగురు జూదరులు, రూ.4వేలను స్వాధీనం చేసుకోగా, మరో నలుగురు పరారైనట్లు తెలిపారు. వారిని కూడా అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరునున్నట్లు తెలిపారు.

## నేతలకు శాశ్వత సభ్యత్వం

కొండాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మాజీ కన్వీనర్ బొట్లగుంట హరిబాబు, మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరావులు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఎమ్మెల్యే ఈ సందర్భంగా వారిని అభినందించారు.

## మతోన్మాదం ప్రమాదకరం

కావలి టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మతోన్మాదంతో దేశానికి ప్రమాదమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి తెలిపారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో పట్టణ కమిటీ కార్యదర్శి పసుపులేటి పెంచులయ్య అధ్యక్షతన మతోన్మాద ప్రమాదంపై చేపట్టిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. మాల్యాద్రి, రావి మాల్యాద్రి, తుమ్మల వెంకయ్య, నరహరి పాల్గొన్నారు.

## ఆర్ఎస్‌కేలతో కొనుగోలు

ఉదయగిరి: రైతులు పండించిన ధాన్యాన్ని మద్దుతు ధరతో రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. శనివారం కృష్ణారెడ్డిపల్లి, బిజ్జంపల్లి, లింగంనేనిపల్లిలోని కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించి రైతులతో చర్చించారు.

## నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే ఇంటూరి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు జనవరి 11 (ఆంధ్రజ్యోతి):నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని 2వ వార్డు ఉర్దూ స్కూల్ నుంచి ఉప్పుచెరువు రోడ్డు వరకు రూ.19.5లక్షల అంచనావ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం సమ్మర్‌స్టోరేజి ట్యాంకు సమీపంలోని స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.అనూష, నేతలు దామా మల్లేశ్వరరావు, షేక్ నాగూర్, చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, ఉన్నం వీరాస్వామి, కూనం నరేంద్ర, ముచ్చు శ్రీనివాసరావు, గడ్డం మాలకొండయ్య, పువ్వాడి కోటయ్య, చుండూరి శ్రీను, సవిడిబోయిన వెంకటకృష్ణ పాల్గొన్నారు.

● ఉలవపాడు: యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పారిశ్రామిక హబ్‌గా నియోజకవర్గం మారబోతుందని ఎమ్మెల్యే ఇంటూరి అన్నారు. చాకిచర్లలో పలమాల వెంకటేశ్వర్లు రూ.2.30లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన పశువుల షెడ్డును ప్రారంభించారు. పాదయాత్ర సమయంలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 27పశువుల షెడ్ల నిర్మాణానికి పాడి రైతులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించి సమస్యలపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. కార్యక్రమంలో కందుకూరు ఏపీడీ బాబురావు, ఉలవపాడు పశుసంవర్ధక శాఖ ఏడీ సురేష్‌నాయుడు, ఏపీవో వెంకటేశ్వర్లు, పశువైద్యరాలు నజ్మా ఉన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కావ్య

కావలి రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే గౌరారంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లోసుమారు రూ.60లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అలాగే 79 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను ప్రారంభించారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని గ్రామస్థులు ఇచ్చిన వినతులు స్వీకరించారు. చిప్పలేరు, పిల్లివాగు కాలువల ఆధునీకరణ పనులు చేపడతామన్నారు. గౌరవరంను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవరపల్లి రాధిక, ఎమ్పీడీవో శ్రీదేవి, విద్యుత్‌శాఖ డీఈ రవికుమార్, ఈఈ బెనర్జీ, పంచాయతీరాజ్ ఈఈ వేణుగోపాల్, డీఈఈ శ్రీనివాసరావు, తహసీల్దారు శ్రావణ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ, ఉప్పాల వెంకట్రావ్, నేతలు చింతం బాబుల్‌రెడ్డి, సూరె శ్రీనివాసులు రెడ్డి, జయశ్రీ పాల్గొన్నారు.

● క్యాలెండర్ ఆవిష్కరణ

కావలి: దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి ఆధ్వర్యంలో శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీధర్ చేతులమీదుగా అంబేద్కర్ క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. ఈ సందరంగా డీఎస్పీ మాట్లాడారు. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకవెళ్లాలన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి, న్యాయవాది యల్లంటి వెంటేశ్వర్లు, రెండో పట్టణ సీఐ గిరిబాబు, సర్కిల్ సీఐ పాపారావు, దళితసంఘాల నేతలు సుకుమార్, ప్రసన్న కుమార్‌బాపట్ల సత్యవతమ్మ, లక్ష్మయ్య పాల్గొన్నారు.



సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి

## న్యూస్ బాక్స్

### ప్రమాదాలపై అవగాహన

సంగం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారి కూడలిలో యువకులకు రోడ్డు ప్రమాదాల నివారణపై ఎస్ఐ రాజేష్ శనివారం అవగాహన కల్పించారు. ముంబయి జాతీయ రహదారిపై హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న యువకులను ఆపి అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు.

### వాలీబాల్ పోటీలు ప్రారంభం

కలువాయి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. కలువాయి, అనంతసాగరం, చేజర్ల, రాపూరు మండలాల పరిధిలో పోటీలు నిర్వహిస్తున్నారు. పండుగ రోజు ఫైనల్స్ పోటీలు ఉంటాయిన నిర్వాహకులు తెలిపారు.

### చోరీ కేసు నమోదు

ఉలవపాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదురు బజారులోని తన ఇంటిలో శుక్రవారం అర్థరాత్రి చోరీ జరిగినట్లు బాధితులు ఏకొల్లు ఉమామహేశ్వరి శనివారం ఫిర్యాదు చేసిందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు.

### క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి



పోటీలను ప్రారంభిస్తున్న పెంచలరావు

ఆత్మకూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు ఓటములతో సంబంధం లేకుండా యువత క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు తెలిపారు. ఆత్మకూరు మండలం కరటంపాడు పంచాయతీ సాతానుపల్లిలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి క్రికెట్ పోటీలను ఆయన శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది నందా ఓబులేశు, సోమశిల ఉత్తర వాలువ వైస్‌చైర్మన్ పూనుగుంట ధనుంజయ, జ్యోతి గిరి పాల్గొన్నారు.

### వృద్ధురాలి మెడలో సరుడు మాయం

మర్రిపాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న వృద్ధురాలి మెడలోని సరుడు మాయమైన ఘటన శనివారం డీసీపల్లిలో వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. వింజుమూరు మండలం శంఖవరం వెకటసుబ్బమ్మ అనే వృద్ధురాలు వైద్యం కోసం నెల్లూరు వెళ్లి తిరిగి ఇంటికి వస్తూ చెన్నై బస్సు ఎక్కింది. ఆమె బస్సు దిగవలసిన స్టేజీ డీసీపల్లి వద్ద మెడలోని సరుడును చూసుకోగా లేక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### కులగణనతోనే న్యాయం

కందుకూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కులగణనతోనే సామాజిక న్యాయం సాధ్యమని, తక్షణమే రాష్ట్రంలో కులగణన చేపట్టాలని బీసీ ఐక్యవేదిక నాయకులు కొండా వెంకటశివయ్య, కళ్లగుంట మోహనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన బీసీ ఐక్యవేదిక సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సర్వే చేపడితే అత్యధిక జనాభా ఉన్న బీసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఫిబ్రవరి 8న బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో కందుకూరులో కులగణనపై సదస్సు నిర్వహించాలని ఈ సందర్భంగా తీర్మానించారు. సమావేశంలో వివిధ బీసీ సంఘాల నాయకులు కొండా వెంకటశివయ్య, కళ్లగుంట మోహనరావు, షేక్ అబ్దుల్లా, షేక్ మధు, వెంకటేశ్వర్లు, కొండయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.

### క్రికెట్ టోర్నీ ప్రారంభం

ఉదయగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్‌లో ముత్యాలపాటి ఖాదర్ సాహెబ్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం నిర్వాహకులు ముత్యాలపాటి హనీఫ్ ప్రారంభించారు. ఈ పోటీల్లో విజేతలైన వారికి మొదటి బహుమతిగా రూ.30వేలు, రెండవ బహుమతిగా రూ.20వేల నగదుతోపాటు మెమోంటోలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖాజామొహిద్దీన్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధికి కలిసి రావాలి

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



మినీగోకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు,జనవరి11(ఆంధ్రజ్యోతి): పట్టణ అభివృద్ధికి అందరూ కలిసి రావాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శనివారం పట్టణ నడుమూరులో యల్లాల మోహన్‌రెడ్డి నిర్మించిన గోకులాన్ని ఎమ్మెల్యే కాకర్ల ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రఘునాథరెడ్డి, జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర యాదవ్, మాజీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సొసైటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రత్యేక బస్సుల ఏర్పాటు

ఉదయగిరి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని దూర ప్రాంత ప్రయాణికుల సౌకర్యార్థం ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి సాధారణ సర్వీసులతో పాటు అదనంగా ఎనిమిది ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఉదయగిరి-హైదరాబాదు-4, ఉదయగిరి- బెంగళూరు-3, చెన్నై-1 సర్వీసు చొప్పున నడుపుతున్నామన్నారు. సాధారణ చార్జీలు వసూలు చేయడం జరుగుతుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి ఆనం రామానారాయణరెడ్డి
- జమ్మవరంలో పశువుల కొట్టాలు, సిమెంటు రోడ్ల ప్రారంభం



పశువుల షెడ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఆనం రామానారాయణరెడ్డి

ఏఎస్ పేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తోందని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామానారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆయన జమ్మవరంలో ప్రభుత్వ సహకారంతో నిర్మించిన పశువుల కొట్టాలను, నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మవరం గ్రామంలోని రామలయం అభివృద్ధికి రూ. 80లక్షలు, కాకర్లపాడు గ్రామంలోని మాతమ్మ దేవాలయం అభివృద్ధికి రూ. 15లక్షలు మంజూరు చేశామని తెలిపారు. ప్రతి గ్రామంలో జలజీవన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు, సిమెంటు రోడ్లు, కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రైతులు, విద్యార్థులు, వృద్ధులు అన్నివర్గాల ప్రజల అభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీరామకృష్ణ, ఎంపీడీవో ప్రసన్నకుమారి, సీనియర్ నాయకులు తాళ్లూరు గిరినాయుడు, ఆనం కైవల్యరెడ్డి, అబూరి రమేష్‌నాయుడు, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, కాటంరెడ్డి నరసింహరెడి, గ్రామ సర్పంచ్ దొరసానమ్మ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బీద రవిచంద్ర జన్మదిన వేడుకలు

అల్లూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర 53వ జన్మదిన వేడుకలను శనివారం అల్లూరులో పార్టీ నాయకులు, కార్యకర్తలు వైభవంగా నిర్వహించారు. పెన్నార్ డెల్టా కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ నేతృత్వంలో స్థానిక నాయకులు స్థానిక కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. పేదలకు దుప్పట్లు పంపిణీ, అన్నదానం చేపట్టారు. 55 మంది యువకులు రక్తదానం చేశారు. బీద రవిచంద్ర మరెన్నో పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, బుల్లా కృష్ణారెడ్డి, మేడా కృష్ణారెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి చైతన్యరెడ్డి, ఎండోటి హరికృష్ణ, తోట శ్రీహరి, అంబటి రాజేంద్ర, కప్పిరి విష్ణు, గుంజి రుద్రయ్య, ఊటు శ్రీకాంత్, దువ్వూరు శేఖర్‌రెడ్డి, యరటపల్లి శేఖర్‌రెడ్డి, పీజీఎం యూత్ సభ్యులు పాల్గొన్నారు.

● బిట్రగుంట: బోగోలు టీడీపీ పార్టీ కార్యాలయంలో బీదరవిచంద్ర జన్మదిన వేడుకలు జరిగాయి. టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కోడూరు వెంకటశ్వరరెడ్డి, ఎల్.సుధీర్‌బాబు, యర్రం వెంకటేశ్వర్లురెడ్డి, మాధవరావు, చిన్నగోవిందు, విజయకుమార్ యాదవ్, ఏ.ఆదిశేషయ్య, వీ.సుబ్బా రావు ఉన్నారు.



వేడుకలో పాల్గొన్న మాలేపాటి నాగేశ్వరరావు, వెంకటేశ్వరరెడ్డి



రక్తదానంలో పాల్గొన్న బీద గిరిధర్, అభిమానులు

## కలిగిరి విద్యార్థినికి బంగారు పతకాలు



బంగారు పతకాలతో శ్రావణి

కలిగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో జరిగిన సౌత్ ఇంటర్నేషనల్ ఫ్రీ స్టైల్ రిలే టోర్నమెంట్‌లో కలిగిరి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని వనిపెంట శ్రావణి ప్రతిభ చూపి బంగారు పతకాన్ని సాధించినట్లు హెచ్ఎం భీమేశ్వరరావు శనివారం తెలిపారు. జిల్లా జంప్‌రోప్ సెక్రటరీ జి.మురళి ఆధ్వర్యంలో తర్ఫీదు పొందిన శ్రావణి ఈ పోటీల్లో కూడా రెండు బంగారు పతకాలు సాధించడం హర్షణీయం అన్నారు. సౌత్ ఇంటర్నేషనల్‌లో సెలక్ట్ జపాన్‌లో జరిగే ప్రపంచకప్ పోటీలకు అర్హత సాధించిందన్నారు. ఈ సందర్భంగా శ్రావణిని రాష్ట్ర జంప్‌రోప్ అధికారులతో పాటు, జిల్లా అధికారులు ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు.

## చండీయాగం పోస్టర్ల ఆవిష్కరణ

కావలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆర్సీపాలెం బ్రిజయదుర్గ ఆస్థాన పీఠంలో ఫిబ్రవరి 12న మహాచండీ యాగం నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకులు పత్రి వీరబ్రహ్మయ్య స్వామి తెలిపారు. శనివారం యాగంకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపచేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, మల్లికార్జున పాల్గొన్నారు.

## వైభవంగా సంక్రాంతి సంబరాలు



కావలి: బహుమతులు అందజేస్తున్న స్వర్ణలత

కావలి టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక 20వ వార్డులోని సచివాలయ వీధిలో శనివారం మీ కోసం స్వచ్ఛంద సంస్థ సభ్యులు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు రాయపాటి దిలీప్ పర్యవేక్షణలో జరిగిన మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారుల ఆటపాటలు నిర్వహించడంతో సందడి వాతావరణం నెలకొంది. ముఖ్యఅతిథులుగా సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ స్వర్ణలత, విశ్రాంత ఉప తహసీల్దారు మొగల్ సిరాజ్‌బేగ్‌లు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మారుతీరావు, రవికుమార్ పాల్గొన్నారు.

● కందుకూరు: ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బందికి కరస్పాండెంట్ కంచర్ల రామయ్య కుటుంబసభ్యులతో కలిసి నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల టెక్నికల్ డైరక్టర్ కె. విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, ఆర్అండ్ డీన్ లక్ష్మణరావు, వైస్ ప్రిన్సిపాల్ హరిబాబు పాల్గొన్నారు.

● కుల్లూరులో

● కలువాయి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కుల్లూరులో మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, నళినమ్మ దంపతుల ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలో పాల్గొన్న మహిళలందరికీ బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

రేపు ముగ్గుల పోటీలు

ఆత్మకూరు: శ్రీకృష్ణ సేవాసమితి, యాదవ ఎంప్లాయిస్ సొసైటీ సౌజన్యంతో సోమవారం మధ్యాహ్నం 3గంటలకు పట్టణంలోని శ్రీకృష్ణ మందిరం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతిగా స్మార్ట్ టీవీ, ద్వితీయ బహుమతి మిక్సీ, తృతీయ బహుమతిగా రైస్‌కు క్కర్ అందజేయడంతో పాటు పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతులు అంజేస్తామన్నారు. ఆసక్తిగల మహిళలు 9573105305, 9704109344 నెంబర్లకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.



కందుకూరు: దుస్తులు అందజేస్తున్న కంచర్ల రామయ్య



కలువాయి: ముగ్గులను పరిశీలిస్తున్న మాదాసు దంపతులు

## పారదర్శకత కోసమే డిజిటలైజేషన్

● రాపూరు పీఏసీఎస్ సీఈవో సన్నిబోయిన పెంచల నరసింహం

రాపూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పీఏసీఎస్‌లో దస్త్రాల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో కంప్యూటరీకరణ పారదర్శకంగా చేస్తున్నామని రాపూరు పీఏసీఎస్ సీఈవో సన్నిబోయిన పెంచల నరసింహం తెలిపారు.



? పీఏసీఎస్ ద్వారా రైతులకు ఎటువంటి సేవలు అందిస్తున్నారు

! రైతులకు పీఏసీఎస్ ద్వారా స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నాం.

? సహకార సంఘాల డిజిటలైజేషన్ వలన ప్రయోజనం ఏమిటి.

! సహకార సంఘాల డిజిటలైజేషన్‌తో పారదర్శకత ఏర్పడుతుంది. ప్రతి పైసాకు జవాబుదారీతనం ఉంటుంది. ఖాతాదారులు ఎప్పుడైనా తన ఖాతాలోని నగదు, రుణ వివరాలు తెలుసుకోవడానికి వీలుంటుంది.

? పీఏసీఎస్‌లో ఆన్‌లైన్ కార్యకలాపాలు నిర్వహించడానికి వీలవుతుందా.

! డిజిటలైజేషన్ ప్రక్రియను రాష్ట్ర సహకార బ్యాంకులు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల ద్వారా పీఏసీఎస్‌లను నాబార్డుతో అనుసంధానిస్తారు. దీంతో పీఏసీఎస్ ఆన్‌లైన్ కార్యకలాపాలు నిర్వహించడానికి, నాబార్డు నుంచి రుణాలు పొందేందుకు సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించుకుంటాయి.

? రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయా.

! ప్రస్తుతానికి పీఏసీఎస్‌లో ఎటువంటి ఎరువులు నిల్వలేవు. జిల్లా అధికారులతో మాట్లాడి ఇండెంట్ పెట్టి రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతాం.

# మున్సిపాలిటీల అభివృద్ధికి డీపీఆర్

● మూడేళ్లలో మారనున్న రూపురేఖలు ● నగరంలో పారిశుధ్యంపై ఆకస్మిక తనిఖీ ● సంతపేట వ్యాపారులతో మంత్రి నారాయణ మాటామంతీ

నెల్లూరు(సిటీ), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మున్సిపాలిటీల అభివృద్ధికి డీపీఆర్ తయారు చేస్తున్నట్లు పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం నెల్లూరులోని పలు డివిజన్లలో ఆయన అధికారులతో కలిసి పారిశుధ్య పరిశీలన చేశారు. సంతపేట మార్కెట్ వ్యాపారులతో మాట్లాడారు. మున్సిపాలిటీలను అన్నింటా అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమగ్ర వివరాలతో కూడిన నివేదికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. మూడేళ్ల కాలపరిమితిగా పెట్టుకుని ఈ అభివృద్ధి నిర్వహిస్తామన్నారు. మురుగు కాలువల్లో పూడికతీతకు రూ. 50 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. వ్యాపారుల విజ్ఞప్తి మేరకు షాపులకు కరెంట్, మరుగుదొడ్ల నిర్మాణాలకు ఆదేశాలిచ్చారు. మార్కెట్‌ను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆకస్మిక తనిఖీలో కొందరు అలసత్వంగా ఉండటంతో వారికి హెచ్చరికలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంసీ అధికారులు, కార్పొరేటర్లు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మహిళతో ముచ్చటిస్తున్న మంత్రి నారాయణ

# ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలి

కోవూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యురాలు విజయభారతి సూచించారు. శనివారం ఆమె స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విద్య, వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలన్నారు. కోవూరు పంచాయతీలో కొనసాగుతున్న అభి వృద్ధి పనులపై చర్చించామని, పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. సంక్రాంతి పర్వదినం కావడంతో పలువురు అధికారులు అందుబాటులో లేరని, తిరిగి ఈనెల 16న పంచాయతీ కార్యాలయానికి వస్తానని చెప్పారు. ఆమె వెంట తహసీల్దారు నిర్మలానందబాబు, ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ చలపతిరావు గౌడ్ తదితరు లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యురాలు విజయభారతి

# నిరుద్యోగ రహిత నియోజకవర్గమే లక్ష్యం

● అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో వేమిరెడ్డి దంపతులు

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజకవర్గాన్ని నిరుద్యోగ రహితంగా మార్చడమే లక్ష్యమని నెల్లూరు ఎంపీ, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు అన్నారు. శనివారం మండలంలోని దామరమడుగు దళితవాడలో జగదీష్ యూత్ ఆధ్వర్యంలో రూ.7లక్షలతో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని వారు ప్రారంభించారు. ముందుగా స్థానిక శివాలయంలో పార్వతి సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మట్లాడుతూ రాచర్లపాడులోని ఇఫ్‌కో కిసాన్ సెజ్‌లో యూకే నుంచి ఇస్రాన్, ఇమ్రాన్ కంపెనీ సెమీ కండక్టర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. అలాగే జిల్లాలో బీబీపీ అనే మరో కంపెనీ వస్తుందని, దీనిద్వారా ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు త్వరలో పాటూరు, దామరమడుగు మధ్యలో కోవూరు కాలువపైన బ్రిడ్జి నిర్మాణం చేపడతామన్నారు. బుచ్చిలో బైపాస్ రోడ్డుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా హైవేపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, సీసీ రోడ్లు చేపట్టామన్నా రు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీహరి, సీఐ శ్రీనివాసులురెడ్డి, నాయకులు మహేష్, జగదీష్ చిన్న, గంగాధర్, చంద్ర మోహన్, హేమంత్ పాల్గొన్నారు.



బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నమస్కరిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

### సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

సీఎం సహాయనిధి నుంచి మంజూరైన బుచ్చిరెడ్డిపాళెం పట్టణానికి చెందిన మనోజ్‌కుమార్‌కు రూ.51వేలు, దామరమడుగుకు చెందిన రాగి హాకిష్‌కు రూ.39వేలు, చెల్లాయపాళెంకు చెందిన అత్తిపాటి రామకృష్ణకు రూ.35 వేల చెక్కులను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు నెల్లూరులోని వారి నివాసంలో అందజేశారు.

### బస్సు సర్వీస్ ప్రారంభం

రాపూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాపూరు నుంచి నెల్లూరు మీదుగా కడపకు నూతన బస్సు సర్వీస్‌ను శనివారం ప్రారం భించామని రాపూరు ఆర్టీసీ డిపో మేనేజర్ అనిల్ కుమార్ తెలిపారు. ముందుగా నూతన బస్సుకు ఆయన పూజా కార్యక్రమం నిర్వహించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎఫ్ ఎస్కె కరిముల్లా, ఎస్టీవి ఎండీ బషీర్‌అహ్మద్, ఆర్టీసీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నెల్లూరు (హరనాథపురం) జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య సీఎం చంద్రబాబును కోరారు. శనివారం మంగళగిరిలో జరిగిన ప్రజా దర్బార్‌లో ఆయన సీఎంను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కేసీ మాట్లాడుతూ 10లక్షలకుపై గా జనాభా ఉన్న యానాదుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐటీడీఏను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. వీలైనంత త్వరగా యానాదుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

## న్యూస్ బాక్స్

### దార్శనికుడు లాల్‌బహదూర్‌శాస్త్రి : వీపీఆర్

నెల్లూరు(హరనాథపురం), జనవరి 11 (ఆంధ్రజ్యోతి):స్వాతంత్య్ర సమరయోధుడు, మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి దార్శనికుడని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శాస్త్రి వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశాన్ని సైనికపరంగా, వ్యవసాయపరంగా పటిష్ట పరిచిన దార్శనికుడు లాల్‌బహదూర్‌శాస్త్రి అన ఆయన పేర్కొన్నారు.

### పేదలకు దుస్తుల పంపిణీ

పొదలకూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోడేరులో శనివారం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ప్రతి ఏటా సంక్రాంతి పండుగకు రెండు రోజుల ముందు ఆ పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తారు.

### 'ఇథాకా'లో వార్షిక వేడుకలు

నెల్లూరురూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నెల్లూరురూరల్‌లోని కనుపర్తిపాడు వద్ద ఉన్న ఇథాకా స్కూల్లో శనివారం 11వ వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీఎస్‌యూ వీసీ డాక్టర్ ఎస్ విజయభాస్కరరావు, అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో ఎన్ పటేల్ మాట్లాడుతూ దేశానికి మంచి సేవ చేయాలంటే మంచి చదువు ఉండాలని తెలిపారు. జీవితంలో గౌరవంగా బతకాలన్నా, స్ఫూర్తిగా నిలవాలన్న చదువు చాలా అవసరమన్నారు. అనంతరం విద్యార్థుల నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల జీఎం జీవన్, డీన్ రవి కుమ్మమూరు, హెచ్ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### 14న మకరజ్యోతి దర్శనం

పొదలకూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా పట్టణంలోని అయ్యప్పనగర్‌లో వెలసి ఉన్న కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణంలోని అయ్యప్ప సన్నిధిలో మంగళవారం మండల పూజ, మకరజ్యోతి దర్శనం కార్యక్రమం నిర్వహించనున్నారు. శబరిమలలో లాగే ఇక్కడ కూడా మకరజ్యోతి దర్శనం ఉంటుంది. ఈ కార్యక్రమంలో గత 21ఏళ్లుగా గురుస్వామి అల్లూరు రమణయ్యస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. జ్యోతి దర్శనం తర్వాత స్వామిని వెన్నతో అలంకరిస్తారు. ముందుగా వినాయకుడు, సుబ్రహ్మణ్యం స్వామి, అయ్యప్పస్వామిలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తారు. తర్వాత భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తారు.

### జ్యోతినగర్‌లో అన్నదానం

నెల్లూరు(విద్య), జనవరి 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని జ్యోతినగర్‌లో శనివారం ఖ్వాజా గరీబ్ నవాజ్ చిట్టీ షరీఫ్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.ఈ సందర్భంగా ట్రస్టీ నాయకులు మాట్లాడుతూ రాజస్థాన్ రాష్ట్రంలోని ఖ్వాజా గరీబ్‌నవాబ్ దర్గా గంధ మహోత్సవం సందర్భంగా తాము ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు షేక్.జావిద్, .ఖాదర్‌మస్తాన్, ముమహరాబ్ బాషా, రంజాన్‌అలీ, షఫి, నబీఉల్లాహ్, ఖలీల్, సయ్యద్ నయామ్, ఖలీల్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

### సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటాం : ఏబీవీపీ

నెల్లూరు(విద్య), జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉత్తర్వులను పట్టించుకోకుండా సంక్రాంతి సెలవుల్లో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటామని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రాహుల్ తెలిపారు. నగరంలోని ఏబీవీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఈనెల 11 నుంచి 20వతేదీ వరకు కళాశాలలకు సెలవులు ప్రకటించిందన్నారు. అయితే కొన్ని కళాశాలలు విద్యార్థులను తరగతులకు హాజరు కావాలని ఆదేశించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కళాశాలలు తరగతులు నిర్వహిస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. తరగతులు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు విద్యార్థి నేతలు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీలో 88 కుటుంబాలు చేరిక

పొదలకూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మవారిపాలెంకు చెందిన 88 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి నెల్లూరులోని తన నివాసంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో నిలిచిపోయిన అభివృద్ధిని కొనసాగించడంతోపాటు సోమశిల జలాలు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అద్దంకి గిరినాయుడు, కొమ్మి వెంకటేశ్వర్లు, కొమ్మి రమేష్‌నాయుడు, రావులపల్లి సురేష్‌నాయుడు, సాగునీటి సంఘం చైర్మన్ వడ్లమూడి వెంకటేశ్వర్లునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన అమ్మవారిపాలెం గ్రామస్థులతో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

### సన్నారెడ్డి కుటుంబానికి పరామర్శ

తోటపల్లిగూడూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరకవిపూడికి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి తండ్రి సన్నారెడ్డి వెంకురెడ్డి(91) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శనివారం ఆ గ్రామానికి వెళ్లి వెంకురెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు బొమ్మి సురేంద్ర, కోడూరు శ్రీనివాసులురెడ్డి, నెల్లపూడి సుధాకర్, ముత్యాల శ్రీనివాసులు, జితేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

### శాశ్వత సభ్యత్వం అభినందనీయం

మనుబోలు,(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతం కోసం గ్రామాల్లో నాయకులు శాశ్వత సభ్యత్వం తీసుకోవడం అభినందనీయమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు మధునాయుడు, జిల్లా నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య, కనుపూరు కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వద్దినేని మస్తాన్ నాయుడు, మనుబోలు టీడీపీ అధ్యక్షుడు సాని వెంకటరమణయ్య, సీనియర్ నాయకులు దండు చంద్రశేఖర్‌రెడ్డిలు రూ.లక్ష వంతున చెల్లించి శాశ్వత సభ్యత్వం పొందారు. దీంతో వీరిని ఎమ్మెల్యే నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాల యంలో శనివారం ప్రత్యేకంగా అభినందించారు.

# గడప గడపకు తిరిగితే సమస్యలు తెలుస్తాయ్ : ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరురూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గడప గడపను పలకరిస్తేనే సమస్యలు తెలుస్తాయని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం నెల్లూరులోని తన కార్యాలయంలో టీడీపీ ముఖ్యనేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. తన సోదరుడు గిరిధర్‌రెడ్డి ఇప్పటికే నగర పరిధిలోని డివిజన్లలో గడపగడప కార్యక్రమం పేరిట స్థానిక సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరిస్తున్నారన్నారు. గ్రామాల్లో ఈ కార్యక్రమం జరిగితే అక్కడి సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రజలకు మరింత దగ్గరై వారికి భరోసా ఇవ్వగలమన్నారు. ఈనెల 18 నుంచి 8 రోజులపాటు ఏడు గ్రామాల్లో గడప గడపకు కార్యక్రమం నిర్వహి స్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా 17వ డివిజన్‌లో గడప గడపకు కార్యక్రమాన్ని గిరిధర్‌రెడ్డి నిర్వహించారు.



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

# రాజరాజేశ్వరి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాన్ని శనివారం హైకోర్టు న్యాయమూర్తి ఏవీ శేషసాయి, కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. సుందరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాజరాజేశ్వరి ఆలయంలో దేవీ ఖడ్గ మాల పూజలు చేశారు. వస్త్రాలు సమర్పించారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అంద చేసి మంగళశాసనాలు అందజేశారు. కార్యక్రమంలో సహాయక కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



నెల్లూరు : రాజరాజేశ్వరి ఆలయంలో వేదాశీర్వచనాలు పొందుతున్న హైకోర్టు న్యాయమూర్తి శేషసాయి

● కామాక్షితాయి సేవలో

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జొన్నవాడ ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి ఏవీ శేషశాయి దంపతులు శనివారం కామాక్షితాయిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఈవో ఏవీ. శ్రీనివాసులురెడ్డి, అర్చకులు ఆలయ సంప్రదాయాలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం వారి గోత్ర నామాలతో స్వామివారికి అభిషేకం, అమ్మవార్లకి ఖడ్గమాల పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు వారివెంట పలువురు న్యాయశాఖ అధికారులున్నారు.

# టీడీపీ నేత బీద రవిచంద్ర జన్మదిన వేడుకలు

నెల్లూరు (వైద్యం) జనవరి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర జన్మదిన వేడుకలు శనివారం నగరంలో ఘనంగా జరిగాయి. టీడీపీ కార్యాలయం, బీద కార్యాలయంలోనూ ఈ వేడుకలు జరిగాయి. పార్టీ నేతలు జన్ని రమణయ్య, శ్రీపతిబాబు, చేజెర్ల వెంకటేశ్వర రెడ్డి పాల్గొని భారీ కేట్ కట్ చేశారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాపూరు రాఘవరెడ్డి, కువ్వారపు బాలాజీ, కేఎల్ రావు, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

# పోలీసు డైరీ ఆవిష్కరణ

నెల్లూరు (క్రైం), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పోలీసు డైరీని నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు డైరీలో సిబ్బంది ఉపయోగపడే సమాచారం ఎంతో ఉం దన్నారు. పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మందిపాటి ప్రసాద్ రావు మాట్లాడుతూ డైరీ తయారు చేసేందుకు అనుమతి, సహాయ సహకారాలు అందించిన ఎస్పీకి, పోలీసు అధికారులకు, స్పాన్సర్లకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఏ శ్రీనివాసరావు, డీ శ్రీనివాసరెడ్డి, జీ శ్రీనివాసరావు, రాజగోపాల్, చెంచురామారావు, చంద్రమోహన్, సీఐలు రవినాయక్, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.




పోలీసు డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

# సంక్రాంతి కప్ క్రికెట్ విజేత పల్స్ జిమ్

నెల్లూరు(విద్య), జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి కప్ క్రికెట్ కప్‌ను పల్స్-72 జిమ్ కైవసం చేసుకుంది. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శనివారం జిమ్‌ల నడుమ జరిగిన వన్‌డే మ్యాచ్‌లో పల్స్-72 జిమ్, ఫ్యూచర్ ఫిట్‌నెస్ జిమ్‌లు తలపడ్డాయి. ఫైనల్స్‌లో జరిగిన పోరులో పల్స్ జిమ్ జట్టు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి కప్‌ను దక్కించుకుంది. బహుమతి ప్రదానోత్సవంలో ఫ్యూచర్ ఫిట్‌నెస్ జిమ్ అధినేత హరీష్ మాట్లాడుతూ అందరూ ఎంతో ఉత్సాహంగా పోటీల్లో రాణించారని, ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. అనంతరం సంక్రాంతి కప్‌ను పల్స్-72 జిమ్ జట్టుకు అందచేసి కెప్టెన్ వంశీని అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్స్, ట్రైనీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## శ్మశాన వాటికల ప్రారంభం

ఇందుకూరుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు, ఇందుకూరుపేట, జంగందొరువు గ్రామాల్లో శ్మశాన వాటికలను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శనివారం ప్రారంభించారు. కొత్తూరు ముస్లిం శ్మశాన వాటికను వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.7లక్షలతో ఆధునీకరించారు. ఇందుకరుపేట జంగందొరువు హిందూ శ్మశాన వాటికలను బీజీఆర్ మైనింగ్ ఇన్ఫ్రా లిమిటెడ్ హైదరాబాదు వారి సౌజన్యంతో గుణపాటి రమేష్‌రెడ్డి దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రావెళ్ల వీరేంద్రనాయుడు, పొన్నెబోయిన చెంచుకిషోర్‌యాదవ్, నాగార్జుననాయుడు, మునగాల రంగారావు, అవ్వారు ఏడుకొండలు, కూకటి వెంకటేశ్వరరెడ్డి, దాసరి విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### వీపీఆర్ నివాసంలో లక్ష సభ్యత్వాల సంబరాలు

నెల్లూరు (హరనాథపురం) జనవరి 11 (ఆంధ్రజ్యోతి): లక్ష సభ్యత్వాలను పూర్తిచేసిన సందర్భంగా నగరంలోని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాసంలో టీడీపీ నాయకులు శనివారం సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వీపీఆర్ దంపతులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వీపీఆర్ మాట్లాడుతూ ఐకమత్యమే మహాబలంగా నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషి చేయడం వల్లే లక్ష సభ్యత్వాల లక్ష్యాన్ని చేరుకోగలిగామన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు కష్టపడుతున్న కార్యకర్తలకు తగిన ఫలితం ఉంటుందన్నారు.

### చౌకిచర్లలో రక్తదాన శిబిరం

విడవలూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): చౌకిచర్లలో మలిరెడ్డి కృష్ణప్రసాద్ మెమోరియల్, నెల్లూరు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి సహకారంతో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన సేవా సంస్థ నిర్వాహకులు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి, స్థానిక పెద్దలు పొలిరెడ్డి ఆశోక్ రెడ్డి, కొమ్మిరెడ్డి మురళీరెడ్డి, నాగల మధుసూదన్ పాల్గొన్నారు.

### క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

మనుబోలు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఎస్ఎస్ఆర్ ట్రస్టు సహకారంతో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఎస్ఐ. శివరాకేష్ ప్రారంభించారు. ఎస్ఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకులు, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డిని అభినందించారు.

### వైభవంగా చెన్నకేశవుడి కల్యాణం

మనుబోలు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవాలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం రాత్రి చెన్నకేశవుని కల్యాణంను వైభవంగా నిర్వహించారు.

## మంత్రి ఆనం ఇంటికి దీపావెంకట్

నెల్లూరు(హరనాథపురం) జనవరి 11(ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె దీపావెంకట్ వెళ్లారు. తన ఇంట జరిగే శుభకార్యానికి రావాలని ఆనం కుటుంబసభ్యులను ఆమె ఆహ్వానించారు.



మంత్రి ఆనం కుటుంబ సభ్యులతో దీపావెంకట్

### మంత్రి ఆనంతో నారాయణ భేటీ

మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తన కార్యాలయానికి వచ్చిన మంత్రి నారాయణను, ఆనం సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాతోపాటు నగరంలోని పలు అభివృద్ధి అంశాలపై వారిద్దరు చర్చించారు.

## 101 పాయసం కలిశాలతో నైవేద్యం

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : వేదాంత దేశికర్ దేవస్థానంలో శనివారం గోదాదేవి తిరుప్పావై కుడారై విళ్లి పాశురం సందర్భంగా 101 పాయసం కలిశాలతో ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మేనేజింగ్ ట్రస్టీ కేసీ వరదరాజన్, ఎన్‌సీ బాలాజీ, రమేష్, బీ రాజగోపాల్, కేసీ నరసింహ, కళ్యాణ సుందరం, తదితరుల పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు విజయసారథి బట్టర్ నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## రాపత్తు ఉత్సవాల ప్రారంభం

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వైష్ణవాలయాల్లో అధ్యయనోత్సవాల సందర్భంగా శనివారం రాపత్తు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అలాగే ద్వాదశ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో స్వామివార్ల విశేష అలంకారాలు చేసి ఊంజల్‌సేవలు, ప్రాకారోత్సవాలు దివ్యనాలాయిర ప్రబంధ ఘోష్టి గానాలు చేశారు.

● నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఉదయం ధనుర్మాసం పూజలు, ద్వాదశి ఏకాదశి పూజలు జరిగాయి. ఆండాళ్ అమ్మవారికి తిరుప్పావై సేవా కాలం జరిగింది. రాత్రి రాపత్తు ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా శ్రీదేవిభూదేవి ఆండాళ్ సమేత రంగనాథస్వామికి విశేష పూజలు, ఊంజల్‌సేవ, ప్రాకారోత్సవం కన్నులు పండువగా జరిగాయి. కాగా రంగడి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీల లెక్కింపు జరిగింది.

## శ్రీరామ మందిరంలో ద్వాదశి వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలాజీనగర్ రామమందిరంలో శనివారం ద్వాదశి ఉత్తర ద్వార దర్శనం వేడుకలు ఘనంగా జరిగా యి. వికాస్ ప్రజాహిత సేవా సంస్థ ఆధ్వ ర్యంలో వైకుంఠ ఏకాదశి, ద్వాదశి వేడుకలు తొలిసారిగా ప్రారంభించారు. దీంతో తూ ర్పు ప్రాంత ప్రజలకు వైకుంఠద్వార ప్రవే శం కల్పించడం జరిగింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు ద్వాదశి ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలను 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్, జ్యోతి దంపతులు దేవస్థానం కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



శ్రీదేవి భూదేవి, రంగనాయకమ్మ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి

## నారాయణ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

నెల్లూరు(విద్య), జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని,విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి భోగిమంటలు, పొంగళ్లతో సందడి చేశారు. అనంతరం పల్లెటూరి వాతావరణంలో హరిదాసు వేషదారణలతో చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, కన్వీనర్ డాక్టర్ ఎం.చంద్ర మోహన్, ఏజీఎం శ్రీధర్, ఏవో వరప్రసాద్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జగన్ శవ రాజకీయాలు మానుకోవాలి

● టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షుడు సందీప్

పొదలకూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి రాజకీయ లబ్ధి కోసం శవ రాజకీయాలు చేస్తూ సీఎం చంద్రబాబు నాయుడుపై విమర్శలు చేస్తున్నారని టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షుడు కే.సందీప్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉండగా విశాఖపట్నం దగ్గర ఎల్జిపాలిమర్స్‌లో 13 మంది, కచ్చలూరులో బోటు ప్రమాదంలో 40 మంది, అన్నమయ్య జిల్లా రాజంపేటలో అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు తెగి 35మంది ప్రాణాలు పోయాయన్నారు. ఆనాడు సీఎంగా ఉన్న జగన్మోహన్ రెడ్డి మృతుల కుటుంబాలను పరామర్శించలేదన్నారు. తిరుప తిలో జరిగిన దురదృష్టకర ఘటనను తన రాజకీయానికి అనుకూలంగా మలుచుకోవాలని ప్రయత్నించా రన్నారు.

ఏడాదిన్నర కిందట అలిపిరి నడక దారిలో మూడు నెలల వ్యవధిలో ఇద్దరు చిన్నారులపై చిరుతలు రాత్రిపూట దాడి చేసిన ఘటన అందరికీ గుర్తుండే వుంటుంది. ఇపుడు ఏకంగా అలిపిరి-చెర్లోపల్లి ప్రధాన రహదారిలో పట్టపగలు ఓ వ్యక్తిపై చిరుత దాడి చేసినంత పని చేసింది. ఎవరి కంటా పడడం ఇష్టపడని జంతువుగా చిరుతకు పేరుంది. అలాంటిది మిట్ట మధ్యాహ్నం పూట అందులోనూ నగరం నుంచీ అడవిలోకి వెళ్ళేందుకు ప్రధాన రహదారి దాటుతూ చిరుత కనిపించడం కలకలం రేపుతోంది. అసలు చిరుత పగటి వేళ శేషాచలం వదిలి అలిపిరి రోడ్డుదాటి మరీ నగరంలోకి ఎందుకు వచ్చింది? అడవి విడిచిపెట్టి వచ్చేంతగా తిరుపతిలో చిరుతలను ఆకర్షిస్తున్నది ఏముంది? అన్న ప్రశ్నలు ఈ సందర్భంగా తలెత్తుతున్నాయి.

# చిరుతలు రోడ్డెందుకు దాటుతున్నాయి?




- అటవీ ప్రాంతంతో కలగలసిపోయిన వర్శిటీలు
- అలిపిరి-చెర్లోపల్లి మార్గంలో హోటళ్లు, హాస్టళ్లు
- వాటినుంచి వచ్చే వ్యర్థాల చుట్టూ చేరుతున్న కుక్కలు, జింకలు, అడవి పందులు
- చిరుతలను ఆకర్షిస్తున్న ఫుడ్ చెయిన్

ఎస్వీయూలో ఏర్పాటైన హెచ్చరిక బోర్డులు

జనవరి 3న ఎస్వీయూలో చిరుత సంచారం

తిరుపతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):ప్రకృతిలో జీవి మనుగడకు ఆధారమైంది ఆహారపు గొలుసు. ఇపుడదే ఆహారపు గొలుసు చిరుతలను శేషాచలం నుంచీ తిరుపతి నగరంలోకి రప్పిస్తోంది. తిరుపతిని శేషాచల అడవుల నుంచీ విడదీసేందుకు ప్రత్యేకంగా ఎలాంటి కంచెలు, ప్రహరీలు లేవు. ఎస్వీ యూనివర్శిటీ మొదలుకుని అనేక విద్యా సంస్థల ఆవరణలు శేషాచల అటవీ ప్రాంతంతో కలసిపోయి వున్నాయి. కేవలం అలిపిరి-చెర్లోపల్లి మెయిన్ రోడ్డు ఒక్కటే వాటిని విడదీస్తోంది. అయితే రాకపోకలను ఆపే సరిహద్దు కాదది. ఒకరకంగా చెప్పాలంటే అడవి నుంచీ జంతువుల రాకపోకలను ఈ రోడ్డు మరింత సులువు చేస్తోంది. ఎస్వీయూ, వేదిక్, వెటర్నరీ వర్శిటీలు, అగ్రికల్చర్ కాలేజీలలో హాస్టళ్ళు వున్నాయి. వాటి ద్వారా రోజువారీ భారీగా వ్యర్థాలు ఆవరణల్లో పోగుపడుతున్నాయి. మరోవైపు అలిపిరి-చెర్లోపల్లి ప్రధాన మార్గం వెంబడీ పలు హోటళ్ళు, కేఫ్‌లు వెలిశాయి. వీటి నుంచీ కూడా పెద్దఎత్తున వ్యర్థాలు పోగు పడుతున్నాయి. ఈ వ్యర్థాల కోసం కుక్కలు, జింకలు, అడవి పందులు యధేచ్ఛగా వస్తున్నాయి. వర్శిటీల ఆవరణల్లో పగలు కూడా జింకలు, అడవి పందులు పెద్ద సంఖ్యలో తిరుగాడుతూ కనిపిస్తున్నాయి. ఇక కుక్కలైతే మందలుమందలుగా తిరుగుతున్నాయి. ఈ మూడింటి కోసం చిరుతలు శేషాచలం నుంచీ రోడ్డు దాటి ఈ వర్శిటీల వైపు వస్తున్నాయి. శేషాచల దిగువ భాగాన వున్న ఎస్వీయూ సహా పలు విద్యా సంస్థల ఆవరణల్లోకి చిరుతలు రావడం కొత్త కాదు. పై జంతువుల కోసం రెండు దశాబ్దాలుగా చిరుతల రాకపోకలు సాగుతున్నాయి. అయితే గతంలో ఎప్పుడూ రాత్రిళ్ళు మాత్రమే ఎవరి కంటా పడకుండా అడవి దాటి వర్శిటీల ఆవరణల్లోకి వచ్చే చిరుతలు ఇపుడు ఏకంగా పగలే చొరబడుతున్నాయి. అలిపిరి నడక దారిలో చిన్నారులపై దాడి జరిగినట్టు వర్శిటీల ఆవరణల్లోనూ, అలిపిరి-చెర్లోపల్లి రోడ్డులోనూ ఇప్పటి దాకా ఎలాంటి ఘటనలూ నమోదు కాలేదు కానీ ఇకమీదట జరగబోవన్న గ్యారంటీ ఏమీ లేదు.ఇప్పటికే అటవీ శాఖ అధికారులు అమర్చిన కెమెరా ట్రాపుల్లో చిరుతల రాకపోకలు, కుక్కలను నోటకరుచుకుని వెళుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి.విద్యార్థులు కూడా తమ మొబైళ్ళలో చిరుతల కదలికలను చిత్రీకరించిన ఉదంతాలున్నాయి.

## ఎస్వీయూలో ట్రాప్ కెమెరాలు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

తిరుపతి (విశ్వవిద్యాయాలు), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పులి వస్తుంది.. జాగ్రత్త అంటూ ఎస్వీయూలో పలు చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటయ్యాయి. ఇటీవల చిరుత సంచారం నేపథ్యంలో విద్యార్థులను, ఉద్యోగులను అప్రమత్తం చేస్తూ ఈ బోర్డులు ఏర్పాటయ్యాయి. సాయంత్రం 6 నుంచీ ఉదయం 6 గంటల వరకూ ఎవరూ యూనివర్సిటీలో సంచరించకూడదంటూ ఇందులో అధికారులు సూచించారు. అయితే, ఈ నెల 3 వ తేదీన యూనివర్సిటీలో చిరుత సంచరించినట్టు ఫారెస్టు అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమరాల్లో రికార్డు అయినట్టు సమాచారం. దీంతో, యూనివర్సిటీలో చిరుత పులి ట్రాప్ బోన్లను కూడా ఏర్పాటు చేయాలని యూనివర్సిటీ అధికారులు ఫారెస్టు అధికారులను కోరారు.పులి సంచారం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు విజ్ఞప్తి చేశారు.

## తక్షణ చర్యలు తీసుకోకుంటే ప్రమాదమే!

శేషాచల అడవుల్లో చిరుతలు సుమారు 50కి పైగా వుంటాయని అంచనా. అడవిలో వాటి సంఖ్య పెరిగేకొద్దీ సులువుగా దొరికే ఆహారం కోసం అడవి దాటి బయటకు రావడం కూడా పెరుగుతోంది. అడవిలో అయితే జింకలు, అడవిపందులు వంటి వాటిని వెంటాడి వేటాడాలి. అదే అలిపిరి-చెర్లోపల్లి రోడ్డు దాటి దక్షిణానికి వస్తే విద్యాసంస్థల ఆవరణల్లో కుక్కలు, జింకలు, అడవిపందులు సులువుగా దొరికే అవకాశముంది. అందుకే ఈ వైపు చిరుతల కదలికలు క్రమేపీ పెరుగుతున్నాయి. అలిపిరి-చెర్లోపల్లి రోడ్డు వెంబడీ హోటళ్ళు, కేఫ్‌లకు అనుమతి రద్దు చేయడం, లేదా కనీసం వారు వ్యర్థాలను దూరంగా పారబోసేలా చర్యలు తీసుకోవాల్సివుంది. వర్శిటీల హాస్టళ్ళ నుంచీ వచ్చే వ్యర్థాలు ఆవరణలో పడేయకుండా చూడాలి. వర్శిటీల ఆవరణల్లో రోజూ ఉదయం, సాయంత్రం వాకింగ్ కోసం వచ్చే వారు కూడా వ్యర్థాలు పడేస్తున్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగా కుక్కలకు పెడుతున్నారు. దీంతో కుక్కల సంఖ్య పెరుగుతోంది. వ్యర్థాలు ఆవరణలో పడేయకుండా నివారిస్తే చిరుతల రాకపోక లు కూడా ఆగిపోతాయని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. చిరుతలు మనుషులపై దాడి చేసే వరకూ ఆగకుండా ఆ దిశగా చర్యలు తక్షణావసరం.



## నేడు తిరుచానూరుకు సీఎం చంద్రబాబు

- ఇళ్లకు పైప్ ద్వారా నేచురల్ గ్యాస్ సరఫరా ప్రారంభం

తిరుపతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు జిల్లాకు రానున్నారు. ఏజీ అండ్ పి కంపెనీకి సంబంధించి తిరుచానూరులో ఇళ్ళకు పైప్‌లైన్ ద్వారా నేచురల్ గ్యాస్ సరఫరా చేసే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.ఏజీ అండ్ పీ కంపెనీగా పిలిచే అట్లాంటిక్ గల్ఫ్ అండ్ పసిఫిక్ కంపెనీ తిరుచానూరు ప్రాంతంలో ఏడాదిగా ఇళ్ళకు వంట గ్యాస్‌ను పైప్‌లైన్ ద్వారా సరఫరా చేసే ప్రాజెక్టును చేపట్టింది. ఇప్పటి వరకూ వంట గ్యాస్ లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ) రూపంలో సిలిండర్ల ద్వారా పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇపుడు ఏజీ అండ్ పీ కంపెనీ నేచురల్ గ్యాస్‌ను పైప్‌లైన్ ద్వారా నేరుగా ఇళ్లకు సరఫరా చేయనుంది. ఇప్పటి వరకూ సుమారు 2 వేల ఇళ్ళకు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆ క్రమంలో ఆదివారం ముఖ్యమంత్రి సంబంధిత కంపెనీ ఆహ్వానం మేరకు తిరుచానూరు పంచాయతీ పరిధిలో బనియన్ ఫ్యాక్టరీ సమీపంలోని శరవణ అనే వ్యక్తికి చెందిన ఇంటిని సందర్శించి గ్యాస్ సరఫరాను ప్రారంభించనున్నారు.అనంతరం హోటల్ తాజ్‌కు చేరుకుని అక్కడ ఏజీ అండ్ పీ కంపెనీ పరిశ్రమలకు నేచురల్ గ్యాస్ సరఫరా ప్రాజెక్టును ప్రారంభిస్తారు. అలాగే అదే సంస్థకు సంబంధించిన సీఎన్‌జీతో నడిచే ద్విచక్ర, మూడు చక్రాల, నాలుగు చక్రాల వాహనాలను, ఎల్‌సీవీలను జెండా ఊపి ప్రారంభిస్తారు.ఆపై అక్కడే కంపెనీ ప్రతినిధులతోనూ, అందులో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న జపాన్ ప్రతినిధుల బృందంతోనూ సమావేశమవుతారు.



గ్యాస్ సరఫరాకు సంబంధించి ఓ ఇంటి వద్ద అమర్చిన మీటరు

### 15 వరకూ స్వగ్రామంలోనే సీఎం

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం సాయంత్రం స్వగ్రామమైన నారావారిపల్లి చేరుకుంటారు. శనివారమే ఆయన సతీమణి నారా భువనేశ్వరి స్వగ్రామం చేరుకుని పలు అభివృద్ధి పనులు పరిశీలించడం, ప్రారంభించడం చేశారు. వీరితో పాటు నందమూరి కుటుంబానికి చెందిన పలువురు కూడా వచ్చే అవకాశముంది.ఆదివారం రాత్రి నుంచీ బుధవారం ఉదయం దాకా వీరంతా గ్రామంలోనే గడపనున్నారు. బుధవారం మధ్యాహ్నం చంద్రబాబు విజయవాడ తిరుగు ప్రయాణమవుతారు. కాగా సీఎం చంద్రబాబు నాలుగు రోజుల పాటు జిల్లాలో వుండనున్న నేపథ్యంలో యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. కలెక్టర్ వెంకటేశ్వర్, ఇంఛార్జి ఎస్పీ మణికంఠ, మున్సిపల్ కమిషనర్ మౌర్య తదితరులు సీఎం పర్యటించే ప్రాంతాలను పరిశీలించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## పక్షుల పండుగపై సందిగ్ధత

- మరో ఐదు రోజుల్లో వేడుక
- ఇప్పటికీ మొదలుకాని పనులు

తడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పులికాట్ వేదికగా మరో వారం రోజుల్లో ప్రారంభం కావాల్సిన ఫ్లెమింగ్ ఫెస్టివల్ నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. గత వైసీపీ హయాంలో ఆపేసిన పక్షుల పండుగను అట్టహాసంగా నిర్వహిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చేలా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కృషి చేశారు. మొదట జనవరి 10, 11, 12తేదీల్లో ఫ్లెమింగ్ ఫెస్టివల్ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. అయితే సమయం తక్కువగా ఉండటంతో 17, 18, 19 తేదీలకు మార్చారు.అదే సమయంలో నాయుడుపేటలో ఏటి పండుగ నిర్వహిస్తుండటంతో 18, 19, 20 తేదీల్లో పక్షుల పండుగ నిర్వహించాలని భావించారు.సూళ్లూరుపేటలో గత మంగళవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పండుగ కమిటీని ప్రకటించి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా ఫ్లెమింగ్ ఫెస్టివల్ నిర్వహణకు మరో వారం రోజులు మాత్రమే ఉండగా ఇప్పటివరకు ఎటువంటి పనులు ప్రారంభంకాలేదు. పండుగ కమిటీ కూడా ఏర్పాట్లకు చొరవచూపడం లేదు. ఈ నేపథ్యంలో పక్షుల పండుగ జరుగుతుందా అన్న అనుమానం జనాల్లో నెలకొంది.

## ముగ్గురు తహసీల్దార్లకు పదోన్నతి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్లకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పోస్టింగ్స్ కేటాయించారు. అందులో భాగంగా జిల్లాలో అత్యంత కీలకమైన ప్రోటోకాల్ -1, ప్రోటోకాల్-2, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులు భర్తీ చేసింది. ప్రోటోకాల్-1 ఎస్‌డీసీగా శివశంకర్‌నాయక్, ప్రోటోకాల్-2 ఎస్‌డీసీగా సువర్ణమ్మ నియమితులయ్యారు. అలాగే ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(ఏపీఐసీసీ) తిరుపతి జోనల్ మేనేజరుగా విజయభారత్‌రెడ్డిని నియమించారు.

## ఇన్‌చార్జి ఎస్పీగా మణికంఠ బాధ్యతల స్వీకరణ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా మణికంఠ శనివారం తిరుపతి ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా ఎస్పీగా పని చేస్తున్న ఈయన్ను తిరుపతి జిల్లాకు ఇన్‌చార్జిగా నియమించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్పీగా పనిచేసిన సుబ్బరాయుడును ప్రభుత్వం హెడ్ క్వార్టర్‌కు బదిలీ చేసిన విషయం విదితమే. మణికంఠ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# శాస్త్రోక్తంగా చక్రస్నానం

**అమ్మవారి ఆలయంలో ముగిసిన ముక్కోటి ఏకాదశి వేడుకలు**

తిరుచానూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వాదశిని పురస్కరించుకుని శనివారం ఉదయం తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ఆలయం నుంచి చక్రత్తాళ్వార్లను వేంచేపుగా పద్మ సరోవరంలోని(అమ్మవారి పుష్కరిణి) పంచమి తీర్థం మండపంలో కొలువుదీర్చారు. వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ చక్రత్తాళ్వార్లకు శాస్త్రోక్తంగా తిరుమంజనం నిర్వహించారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా చక్రత్తాళ్వార్‌ను అమ్మవారి పుష్కరిణిలో అర్చకులు మూడుసార్లు మునక వేయించారు. అశేష భక్తజనం పుణ్యస్నానాలు ఆచరించారు. దీంతో అమ్మవారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్, అర్చకులు బాబుస్వామి, శ్రీనివాసులు, సూపరింటెండెంట్ రమేష్‌తో సుభాస్కర్‌నాయుడు, చలపతి, బ్రహ్మానందరాజు పాల్గొన్నారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.45 కోట్లు



తిరుమల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.45 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించింది. రూ.2.45 కోట్లు ఆదాయం లభించినట్లు టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది.



# సేవాపథాన యువోత్సాహం

'కెరటం నాకు ఆదర్శం... పడుతున్నా మళ్లీ లేస్తున్నందుకు..' యువతకు మార్గనిర్దేశకుడిగా నిలిచిన స్వామి వివేకానందుడు చెప్పిన మాటలివి. రోజుకు ఒక్కసారైనా మీతో మీరు మాట్లాడుకోండి.. లేకపోతే ఓ అద్భుతమైన వ్యక్తితో మాట్లాడే అవకాశాన్ని మిస్సవుతారంటూ ఆ మహనీయుడు తరతరాలకీ తరగని స్ఫూర్తిదాయకమైన మాటలెన్నో చెప్పారు. యువతరానికి ఆయన హితవచనాలు సన్మార్గాన్ని చూపుతాయి. బంగారు భవితకు బాటలు వేస్తాయి. అందుకే వివేకానందుడి జయంతిని జాతీయ యువజనోత్సవంగా జరుపుకొంటున్నాం. ఆ మహానుభావుని మాటలతో స్ఫూర్తి పొంది ఉన్నత సమాజ నిర్మాణంలో తాము భాగస్వాములు కావాలనే బలమైన సంకల్పంతో పనిచేస్తున్న ఈ ఇద్దరూ ఏమంటున్నారో తెలుసుకుందాం.

- గూడూరు అర్బన్ / తడ (ఆంధ్రజ్యోతి)



లేవండి..మేల్కోండి..
గమ్యం చేరేవరకూ విశ్రమించకండి
హృదయానికి, మెదడుకూ సంఘర్షణ తలెత్తితే
హృదయాన్నే అనుసరించండి
- స్వామి వివేకానంద

■ నేడు వివేకానంద జయంతి



## వివేకామాట.. చూపింది బాట..

మాది రాజస్థాన్‌లోని కోట జిల్లా ముంగేనా గ్రామం. 12వ తరగతి వరకు ఇటావా లోనే విద్యాభ్యాసం గడిచింది. 2017లో భోపాల్‌లోని ఎన్ఐటీలో బీటెక్ చేశాను. రిలయన్స్ ఇండియా లిమిటెడ్‌లో మంచి జీతంతో ఉద్యోగం వచ్చింది.నా లక్ష్యానికి అది సరికాదనిపించింది. ప్రజలతో మమేకమై సేవ చేయలనే లక్ష్యం ఉండేది. ఈ కారణంతోనే కొన్నాళ్లు ఆ ఉద్యోగం చేసి వదిలేశాను. ఢిల్లీ వెళ్లి సివిల్ సర్వీసెస్ కోచింగ్‌లో చేరాను. మొదటి ప్రయత్నంలో స్టేట్ సివిల్ సర్వీస్‌కు ఎంపికయ్యాను. కానీ నాకు అది తృప్తినివ్వలేదు. అపుడే వివేకానందుడి స్ఫూర్తి మాటలు గుర్తుకొచ్చేవి.నాలో ఉత్సాహాన్ని రగిలించేవి.2021లో రెండవసారి ప్రయత్నించాను. 588 ర్యాంకుతో ఐపీఎస్ వచ్చింది. హైదరాబాద్‌లో శిక్షణకు జాయిన్ అయ్యాను. పోలీసుశాఖకే పరిమితం కావాలంటే మనసు అంగీకరించలేదు. వైద్యం, ఆరోగ్యం, విద్య తదితర రంగాల ద్వారా సేవచేయాలనే ఆకాంక్షకు దూరమయ్యానన్న బాధ వెంటాడేది. ఐపీఎస్ శిక్షణ పొందుతూనే మూడవ సారి సివిల్స్ రాశాను. ఈ ప్రయత్నం ఫలించింది. 343 ర్యాంకుతో ఐఏఎస్‌కు సెలెక్టయ్యాను. ఈ మూడు ప్రయత్నాల్లో నా సంకల్పానికి నాన్న, అమ్మ, తమ్ముడు, స్నేహితులు అండగా నిలిచారు. కెరీర్‌లో నేను అనుకున్న లక్ష్యాన్ని ఛేదించడంలో వివేకానందుడి మాటలు ఎంతగానో ప్రేరణగా నిలిచాయి. ఆయన తత్వం నా కెరీర్‌లో ప్రతి మెట్టునూ ప్రభావితం చేసింది. ఇప్పటివరకు సమాజం నాకు చాలా ఇచ్చింది. ఇప్పుడు సమాజానికి ఎంతో చేయాలనుంది. 'లేవండి.. మేల్కోండి... గమ్యం చేరే వరకు విశ్రమించకండి. లక్ష్యంపై ఉన్న శ్రద్ధ, ఆసక్తి లక్ష్యసాధనలో సైతం చూపించాలి.. అన్న మహనీయుడు వివేకానంద స్ఫూర్తిని నేటితరం మరువకూడదంటాను.

- రాఘువేంద్ర మీనా, ఐఏఎస్, గూడూరు సబ్‌కలెక్టర్



## యువత రాజకీయాల్లోకి రావాలి

మాది నాయుడుపేట మండలం భీమవరం సొంతూరు. మా నాన్న సుబ్రహ్మణ్యం ఎంపీగా పనిచేశారు. రాజకీయాల్లో అడుగుపెట్టి సమాజాభివృద్ధికి కృషి చేయాలనే సంకల్పం నాలో రగిలించారు. ఇదే సమయంలో వివేకానందుడి మాటలు నన్ను ఎంతగానో ప్రభావితురాలిని చేశాయి. ఆయన బ్యాంక్ అధికారిగా పనిచేసినా తరువాత రాజకీయాల్లోకి వచ్చి గ్రామాభివృద్ధికి తోడ్పడేవారు. నాకు చిన్నప్పటి నుంచి హాస్టల్‌లో ఉండి చదువుకోవడం అలవాటైపోయింది. చదువుతో ఉన్నత స్థాయికి చేరి ప్రజలకు సహాయపడవచ్చని అమ్మానాన్నా చెప్పేవారు. ఆ మాటలు ప్రభావితం చేశాయి.ఎంబీబీఎస్ చదువుతున్నప్పుడు ఐదేళ్లు పుస్తకాలే ప్రపంచంగా బతికాను. గత ఏడాది పీజీ ఎంట్రన్స్‌కు ప్రిపేరవుతున్న దశలో అనూహ్యంగా రాజకీయాలవైపు వచ్చాను.ఆ సమయంలో చంద్రబాబునాయుడి పోరాటపటిమ, మనోనిబ్బరం నాలో స్ఫూర్తిని నింపాయి. గతేడాది ఎన్నికల్లో టీడీపీ పక్షాన పోటీ చేశాను. ఎమ్మెల్యేనయ్యాను. డాక్టర్ అంటే కొంతమందికే సేవచేసే అవకాశం ఉంటుంది. రాజకీయాల్లో అన్ని రంగాల వారికీ సేవచేసే వీలుంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో యువత రాజకీయాల్లోకి రావాలి. మెరుగైన సమాజ నిర్మాణానికి నడుం బిగించాలి. ప్రజలకు సేవచేసే అవకాశాన్ని యువతరం దూరం చేసుకోకూడదని అభిప్రాయపడుతున్నాను. ప్రతి సందర్భంలోనూ యువతరాన్ని ఉత్తేజితులను చేసి ముందుకు నడిపే వివేకానందుడి మాటలను తరచూ గుర్తు చేసుకుంటాను.

- నెలవల విజయశ్రీ, ఎమ్మెల్యే, సూళ్లూరుపేట

# ఘనంగా ట్రిపుల్ ఐటీ - శ్రీసిటీ స్నాతకోత్సవం



● 298 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం

శ్రీసిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఐఐఐటీ - శ్రీసిటీ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 298 మంది విద్యార్థులకు ఐఐఐటీ - శ్రీసిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఏం.వీ.కార్తికేయన్ పట్టాలను ప్రదానం చేశారు. ఐఐఐటీ-శ్రీసిటీ ఛైర్‌పర్సన్, జోహో కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, సీఈవో డాక్టర్ శ్రీధర్ వెంబు వర్చువల్‌గా సమావేశానికి అధ్యక్షత వహించగా, ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ ముఖ్య అతిథిగా ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఛైర్మన్ శ్రీనిరాజు, శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, క్యాటర్ పిల్లర్ టెక్నాలజీ వైస్ ప్రెసిడెంట్ భువన్ ఆనంద్‌క్రిష్ణన్, ఎడబ్ల్యుఎస్ ఇండియా చీఫ్ టెక్నాలజిస్ట్ శాలినీ కపూర్ తదితర సెనేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కార్తికేయన్ 2023 - 2024 సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికను సమర్పించారు. డాక్టర్ శ్రీధర్ వెంబు పట్టభద్రుల విజయాలను అభినందిస్తూ విజ్ఞాన సముపార్జన దశనుంచి సమాజానికి, దేశానికి సేవచేసే స్థితికి ఎదగాలని సూచించారు. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ తన వర్చువల్ ప్రసంగంలో మనిషి విజయం సాధించాలంటే ఆసక్తి, నిబద్ధత, ప్రావీణ్యం, సంకల్పం, ఏకాగ్రత, నేర్చుకునే సామర్థ్యం వంటి ఆరు ముఖ్య లక్షణాలు అవసరమని వివరించారు. ఐఐఐటీ-శ్రీసిటీ, ఇస్రో మధ్య భవిష్యత్ సహకారాలు ఉండగలవన్న ఆశాభావం వ్యక్తం చేస్తూ ఒక ఉమ్మడి పరిశోధనా విభాగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. స్నాతకోత్సవంలో ఐదుగురికి పీహెచ్‌డీ, ఇద్దరికి ఎంఎస్, మరో ఇద్దరికి ఎంటెక్, 298 మందికి బీటెక్ పట్టాలను ప్రదానం చేశారు. బీటెక్ విభాగంలో మోహన్ సాయికృష్ణ (కంప్యూటర్ సైన్స్), దాచర్ల శ్రీజ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్) బంగారు పతకాలను అందుకున్నారు.

## బాధితులకు టీటీడీ సాయం

తిరుపతి(వైద్యం), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ చేసే సమయంలో జరిగిన తొక్కిసలాటలో గాయపడి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ కోలుకున్న బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు శనివారం రాత్రి స్విమ్స్‌కు చేరుకుని చెక్కులను అందజేశారు. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం నరసాపురానికి చెందిన ఎస్.తిమ్మక్క, విశాఖపట్నంకు చెందిన పి.ఈశ్వరమ్మలకు రూ.5 లక్షల చొప్పున, స్వల్ప గాయాలైన అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం నరసాపురానికి చెందిన కె.నరసమ్మ, పి.రఘు, కె.గణేష్, పి.వెంకటేష్, చిన్నప్పయ్యలకు రూ.2 లక్షల చొప్పున నష్టపరిహారం అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు షాజహాన్, పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, గాలి భాను ప్రకాష్, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, కలెక్టరు వెంకటేశ్వర్, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, కార్పొరేటర్ మునికృష్ణ, టీడీపీ నేతలు శ్రీధర్‌వర్మ, మోహన్‌రావు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కులను అందజేస్తున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

# అవనిపై హరివిల్లు

**విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్**

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ







ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ















ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత





కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మీ (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

## వైభవంగా రంగనాథుడి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో రంగనాథస్వామి

తడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేనాడులో వైకుంఠ ద్వాదశి సందర్భంగా శనివారం రంగనాథుడి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఏటా ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని రామాలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభించి 24 గంటల పాటు భజనలు చేస్తారు. మరుసటి రోజు వైకుంఠ ద్వాదశి నాడు గ్రామంలో ఉన్న శ్రీరంగ పెరుమాల్ ఆలయం వద్ద నుంచి రంగనాథస్వామి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంక రించి భక్తుల భజనల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సుదర్శన్‌రావు, శ్రీరాములు, వెకంటాద్రి, ఎన్.భాస్కర్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న ట్రస్టు చైర్మన్ చాగణం గౌరీ శంకర్

పెళ్లకూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పెళ్లకూరులోని చాగణం లలితమ్మ, భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. 180 మంది మహిళలు పాల్గొని పోటాపోటీగా ముగ్గులు వేశారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా చిట్టేటి శాంతిప్రియ, భవానీకి రూ.10 వేలు, రెండో బహుమతిగా పునబాక వెన్నెల, కీర్తనకు రూ.5 వేలు, మూడో బహుమతిగా పెళ్లకూరు నిఖితకు రూ.2 వేలను ట్రస్టు చైర్మన్ చాగణం గౌరీ శంకర్ చేతుల మీదుగా అందజేశారు. ట్రస్టు నిర్వాహకులు పెనుబల్లి సీతారామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు



వట్రపాలెంలో టీడీపీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

సూళ్లూరుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం జోరుగా సాగింది. ఆదివారంతో గడువు ముగుస్తుండడంతో ఆ పార్టీ నాయకులు అన్ని ప్రాంతాల్లో తిరిగి సభ్యత్వం తీసుకొనేలా చొరవ చూపారు. పట్టణంలోని వట్రపాలెం, సాయినగర్ ప్రాంతాల్లో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్ ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి సభ్యత్వం నమోదు చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండలరావు, బూత్ కన్వీనర్ మునిశేఖర్, ఉపేంద్ర పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

గూడూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనార్దనరెడ్డి కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త రమణమ్మ అనారోగ్యంతో శనివారం మృతిచెందింది. ఆమె అంత్యక్రియల నిమిత్తం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ దాతృత్వంతో రూ.5 వేల ఆర్థికసాయాన్ని స్థానిక టీడీపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో తక్కెళ్లపాటి చంద్రమౌళి, మైనంపాటి మోహన్, పచ్చవ శ్రీధర్ నాయుడు, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్చకులకు పంచాంగాల అందజేత



అర్చకులకు పంచాంగాలు అందజేస్తున్న మల్లికార్జున శర్మ, పక్కన దాత అనంతకుమార్ దీక్షితులు తదితరులు

సూళ్లూరుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న సీతారాముల ఆలయంలో శనివారం గాయత్రీ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం అర్చకులు, పురోహితులకు పంచాంగ పుస్తకాలను అందజేశారు. మద్వేంకటరామ్మూర్తి ఆలయ ప్రధాన అర్చకులు వినుగొండ అనంతకుమార్ దీక్షితులు, స్వాతి దంపతుల సహకారంతో పంచాంగాలను అందజేశామని గాయత్రీ సేవా సమాఖ్య వ్యవస్థాపకుడు కారంచేటి మల్లికార్జున శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమాఖ్య మహిళ అధ్యక్షురాలు శోభన, సురేంద్ర, సీతారామయ్య, అనంత పద్మనాభ శర్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## భోగి, సంక్రాంతి పండుగలపై అవగాహన

చిల్లకూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదనం గ్రామంలో శనివారం శ్రీకాళహస్తికి చెందిన త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో భోగి, సంక్రాంతి పండుగలపై అవగాహన, భగవద్గీత గ్రంథంపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో ఎనిమిది రోజులపాటు భోగి, సంక్రాంతి పండుగల విశిష్టపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, శేషాద్రి, రమణారెడ్డి, పద్మమ్మ, రేణుకాదేవి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

## గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం



భానుప్రకాష్ మృతదేహం

వాకాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తూపిలిపాళెం సముద్రతీరంలో గురువారం గల్లంతైన విద్యార్థి ఇంగిలాల భానుప్రకాష్ (18) మృత దేహం శనివారం ఉదయం లభ్యమైంది. చిట్టమూరు మండలం మల్లాం సీవీ ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో చదువుతున్న 8 మంది విద్యార్థులు గురువారం వాకాడు మండలంలోని తూపిలిపాళెం సముద్రతీరంలో సముద్రస్నానానకి వెళ్లిన విషయం తెలిసిందే. ఈత కొడుతూ ఇద్దరు గల్లంతు కాగా, ఓ విద్యార్థి మామిడి లోకేష్ మృతదేహం శుక్రవారం సాయంత్రం ఒడ్డుకు చేరింది. మరో విద్యార్థి, చిట్టమూరు మండలం కొక్కుపాళెం గ్రామానికి చెందిన మస్తానయ్య కుమారుడు భాను ప్రకాష్ మృతదేహం శనివారం ఉదయం లభ్యమైంది. బాలిరెడ్డిపాళెం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మానమాలలో నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం - ఓజిలి శిథిలావస్థకు చేరిన దృశ్యం

## నిరుపయోగంగా సంపద కేంద్రాలు

ఓజిలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పేరుతో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. మండలంలోని అన్ని పంచాయతీల్లో 20 షెడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం ఒక్కోదానికి రూ.5.10 లక్షల నుంచి రూ.3.30 లక్షల వరకు వ్యయం చేశారు. కొన్నాళ్ల పాటు బాగానే సాగినా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటి నిర్వహణ పట్టించుకోలేదు. గ్రామాల్లో చెత్త సేకరణ కూడా నిలిపివేశారు. దీంతో సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారడంతో పాటు శిథిలావస్థకు చేరుకున్నారు. కొన్ని గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలు మందుబాబులకు అడ్డాగా మారగా, కొన్నిచోట్ల అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. కూటమి ప్రభుత్వం లోనైనా సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకువస్తే గ్రామాల్లో పారిశుధ్యంతో పాటు పంచాయతీలకు ఆదాయం చేకూరుతుంది. ఈ విషయమై ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ ఇప్పటికే చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల వివరాలను సేకరించి సిద్ధం చేశామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు నిధుల లభ్యతను దృష్టిలో వుంచుకుని ఆయా కేంద్రాల నిర్వహణ చేపడతామని చెప్పారు.

## క్రీడల పట్ల యువత మక్కువ పెంచుకోవాలి: కురుగొండ్ల



క్రికెట్ పోటీలను ప్రాంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

డక్కిలి, జనవరి 11 : (ఆంధ్రజ్యోతి): క్రీడల పట్ల యువత మక్కువ పెంచుకోవాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం డక్కిలిలో దివంగత పిన్నక కొండయ్య, రత్నమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు జగదీష్ బాబు ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల చక్కటి నడవడిక, దేహదారుఢ్యం, మానసిక వికాసం వంటి ఎన్నో మంచి లక్షణాలు అలవడుతాయన్నారు. ప్రతి ఏడాదీ డక్కిలిలో జగదీష్ బాబు ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం మంచి సంప్రదాయమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుణశేఖరరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, వైస్‌ఎంపీపీ గడ్డం చంద్రశేఖరరెడ్డి, వేముల నాగభూణం నాయుడు, మాధవాయపాళెం సర్పంచు మాధవరెడ్డి, నాయకులు డక్కిలి చంద్రారెడ్డి, రత్నాకరరెడ్డి, పెంచలరెడ్డి, చైతన్య, సర్వేపల్లి రత్నయ్య, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ అరెస్టు

కోట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ షేక్ సర్దార్‌బాషాను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏఎస్‌ఐ శోభారాణి శనివారం తెలిపారు. కోట పట్టణంలో ఈనెల 9న బైక్‌లో వెళ్తున్న రమణయ్యను వాకాడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో రమణయ్యకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌ను అరెస్టు చేసి హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

## బస్సుల్లేక ప్రయాణికుల ఇబ్బందులు

సూళ్లూరుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంత్రి పండుగకు సొంతూరికి వెళ్లేందుకు బస్సుల్లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పతుతున్నారు. సూళ్లూరుపేట, తడ ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమల్లో నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, విజయనరగం, విశాఖపట్నం తదితర ప్రాంతాలవారు ఎక్కువగా పనిచేస్తున్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు వరుస సెలవులు ఇవ్వడంతో కార్మికులు వారి స్వగ్రామాలకు బయలుదేరారు. రాత్రి 8 గంటల వరకు కూడా బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. సూళ్లూరుపేట నుంచి నెల్లూరు వైపు వెళ్లేందుకు మధ్యాహ్నం నుంచి బస్సులు లేవని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో రద్దీ ఉంటుందని తెలిసినా ఆర్టీసీ అధికారులు తగిన ఏర్పాట్లు చేయలేదని ప్రయాణికులు మండిపడ్డారు.

## ఏటి పండుగలో సంక్రాంతి సంస్కృతిని అవలంబించాలి



నెలవలకు వినతిపత్రం ఇస్తున్న విశ్వహిందూపరిషత్ సభ్యులు

నాయుడుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఏటి పండుగ రోజుల్లో సంక్రాంతి సంస్కృతిని ప్రజలందరికీ తెలియజేసేలా కార్యక్రమాలు చేపట్టాలని కోరుతూ సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యానికి విశ్వహిందూ పరిషత్ సభ్యులు శనివారం వినతిపత్రం అందజేశారు. అలాగే మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపికకు కూడా వినతిపత్రం అందజేశారు. సంక్రాంతి సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు నేటి తరాలకు తెలియజేసేలా గోసంరక్షణ, బొమ్మల కొలువు వంటివి ఏర్పాటు చేయాలన్నారు.

## 9 బైక్‌ల స్వాధీనం: ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్ల వద్ద అర్బన్ సీఐ బాబి

నాయుడుపేట టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సుమారు రూ.18 లక్షల విలువ చేసే 9 బైక్‌లను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు నాయుడుపేట అర్బన్ సీఐ బాబి తెలిపారు. శనివారం నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో మీడియాతకు వివరాలు వెల్లడించారు. నాయుడుపేట - బిరదవాడ జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్న నాయుడుపేటకు చెందిన షేక్ షమీఉల్లా, గుమ్మిడిపూడికి చెందిన కె.అర్జున్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా వారిరువురూ 9 బైక్‌లు చోరీ చేసినట్లు వెల్లడించారు. దీంతో వారి వద్ద నుంచి 9 బైక్‌లను స్వాధీనం చేససుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు బాబి తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన అర్బన్ సీఐ బాబి, హెడ్ కానిస్టేబుల్ నాగూరయ్య, కానిస్టేబుళ్లు పోలయ్య, సాహెల్, దయాకర్, భానుతేజ, మస్తానయ్యను డీఎస్పీ చెంచుబాబు ప్రత్యేకంగా అభినందించారు.

## ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

కోట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నాయుడుపేట మండలం మేనకూరుకు చెందిన గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ ప్రాంగణ ఎంపికలను నిర్వహించింది. మెకానికల్, ఎలక్ట్రికల్, ఐటీ, సీఎస్‌సీ, ఏఐడీఎస్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 46మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ కిషాన్‌దాస్, ఆయా విభాగాధిపతులు అభినందించారు.

## కమనీయంగా గోదాదేవి కల్యాణం



కల్యాణానికి కొలువుదీరిన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

సూళ్లూరుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో శనివారం గోదాదేవి కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి వేదపండితులు, మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కల్యాణాన్ని తిలకించారు.

## బీసీ సంక్షేమ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లుకు నియామక పత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

నాయుడుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జడపల్లి వెంకటేశ్వర్‌గౌడ్ నియమితులయ్యారు. శనివారం తిరుపతిలో జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు.

## అన్నదానం

గూడూరు అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో శనివారం ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ప్రభాకర్, శ్రీనివాసులు, కుమార్ నాయుడు, నాగరాజు, కల్యాణి పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, పూజలు, మధ్యాహ్నం అన్నదాన, రాత్రికి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ జరిపారు. ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు.

## యువత క్రీడల్లో రాణించాలి

చిల్లకూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి అన్నారు. శనివారం మండలంలోని ఓడూరు గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానికుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటును ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సుమన్, చంద్ర, వెంకట సుబ్బమ్మ, చక్రి, గురుహరి, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలి



టెన్నికాయిట్ క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

గూడూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూనియర్ టెన్నికాయిట్ పోటీల్లో విద్యార్థినులు ప్రతిభచాటి ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ అన్నారు. పలాసలో ఆదివారం నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనేందుకు వెళుతున్న విద్యార్థినులను శనివారం గూడూరు రైల్వేస్టేషన్‌లో అభినందించారు. పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ జట్టుకు ఎంపికవ్వాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## భగవద్గీతపై ప్రచారం

వాకాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు, కొత్తపాళెం, సాయిబులపాళెం, పల్లిపాళెం, ముట్టెంబాక, రుద్రవరం, గొల్లపాళెం, గూండ్లూ, తూపిలిపాళెం, బూడిదలవాగు, కొండూరు, అందలమాల గ్రామాల్లో ప్రబోధ సేవాసమితి ఇందు జ్ఞానవేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సురమౌళి, సుధాకర్ ఆచారి, ధనలక్ష్మి, నారాయణమ్మ, శేఖర్, శ్రీదేవి, రత్నం, కొండమ్మ, సాయితేజేశ్వని, రామయ్య, సురేంద్ర, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపరియలో భగవద్గీత ప్రచారం నిర్వహించారు. అశోక్‌బాబు, బాలాజీ, భాస్కర్, సంతోష్, ఝాన్సీ, వాణిశ్రీ, గౌతమ్ కృష్ణ, జీవరత్న, రేఖ, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కోట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శ్రీలక్ష్మమ్మకాలనీ, చిట్టేడు, నెల్లూరుపల్లి కొత్తపాళెం, వంజివాక, గోవిందపల్లి గ్రామాల్లో ఉన్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆయా ఆలయాల్లోని స్వామివారికి అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. కోట శ్రీలక్ష్మమ్మకాలనీలో ఉన్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు సాయిబాబా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం జరిగింది.

## సంక్రాంతి వేడుకలు



భోగిమంటలు వేస్తున్న విద్యార్థినులు

గూడూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలకు పండుగలు ప్రతీకగా నిలుస్తాయన్నారు. సంక్రాంతి పండుగ విశిష్టతను యువతకు తెలియజేసేందుకు వేడుకలు నిర్వహించామని, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు గాలిపటాలు, రంగవల్లుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. భోగిమంటలు వేసి సంక్రాంతి వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో కొండారెడ్డి, వెంకటేశ్వర్లు, సజ్జాన్, స్వర్ణ, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## గోకులం షెడ్ ప్రారంభం

వాకాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు గ్రామంలో నిర్మించిన గోకులం షెడ్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదనరెడ్డి శనివారం ప్రారంభించారు. ఎంపీడీవో అన్నపూర్ణరావు, ఏపీవో విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ట్రైసైకిళ్ల వితరణ

చిల్లకూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన పది మంది దివ్యాంగులకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులునాయుడు ట్రైసైకిళ్లను శనివారం అందజేశారు. చేడిమాలలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజనేని రామయ్యనాయుడు, అనూబ్‌బాబు, బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేస్తున్న శ్రీనివాసులు నాయుడు





టీడీపీ శాశ్వత సభ్యత్వం స్వీకరించిన వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధరం - ఎమ్మెల్యే విజయశ్రీ సమక్షంలో శాశ్వత సభ్యత్వం తీసుకొంటున్న ఏజీ కిషోర్

## టీడీపీ శాశ్వత సభ్యత్వం స్వీకరణ

వెంకటగిరి, సూళ్లూరుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధరం రూ.లక్ష చొప్పున చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం పొందారు. అలాగే సూళ్లూపేట పట్టణ టీడీపీ కార్యదర్శి ఏజీ కిషోర్ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సమక్షంలో రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వ నమోదు చేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకరరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, అలవల శ్రీనివాసులు, పార్థసారథి, రాజేంద్రప్రసాద్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.